Postel No. MBN/08/2016-2018



పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల నొప్పులకు సమూలకంతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895


# వార్తాతరంగాలు


జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి 19 | సంచిక :294 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | మంగళవారం 02 జనవరి 2024 | పేజీలు :12 | వెల రూ5 /-


## శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు
# మెట్రో..

### యువత కోసం ప్రత్యేక విశ్వవిద్యాలయాలు
### సీఎం రేవంత్ రెడ్డి



**హైదారాబాద్:**మెట్రో కానీ , ఫార్మాసిటీ కానీ రద్దు చెయ్యడం లేదని ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్ట్రీమ్ లైన్ చేస్తున్నా. ఎయిర్పోర్టు కి ముందు ప్రభుత్వం ప్రతిపాదించిన రూట్లతో పోలిస్తే దూరం తగ్గిస్తాం.బీహెచ్ఈఎల్ నుంచి ఎయిర్పోర్ట్ వరకు 32 కిలోమీటర్లు వస్తుంది.ఎం జి బి ఎస్ నుంచి పాతబస్తీ మీదుగా శంషాబాద్ ఎయిర్పోర్టు వరకు మెట్రో ఉంటుంది. నాగోల్ నుంచి ఎల్బీ నగర్, ఓవైసీ హాస్పిటల్ మీదుగా చాంద్రాయణ గుట్ట వద్ద ఎయిర్పోర్టు కి వెళ్లే మెట్రో లైన్ కి లింక్ చేస్తామని అన్నారు.మియాపూర్ నుంచి అవసరమైతే రామచంద్ర పురం వరకు మెట్రో పొడిగిస్తాం. అవసరమైతే మైండ్ స్పేస్ వరకు ఉన్న మెట్రో ని ఫైనాన్షిల్ డిస్ట్రిక్ట్ వరకు పొడిగిస్తాం. గచ్చిబౌలి ఏరియా నుంచి ఎయిర్పోర్టు కి మెట్రో వెళ్లేవారు దాదాపు ఉండరు. మేము కొత్తగా ప్రతిపాదిస్తున్న మెట్రో లైన్స్ ముందు ప్రభుత్వం ప్రతిపాదించిన మొత్తం కంటే తక్కువ అవుతుంది. ఫార్మాసిటీ ని అంచలంచలుగా రింగ్ రోడ్ రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రత్యేకంగా క్లస్టర్లను ఏర్పాటు చేస్తాము. జీరో కాలుష్యం తో ఈ క్లస్టర్లు ఏర్పాటు చేస్తాం. అక్కడనే అక్కడి పరిశ్రమల్లో పనిచేసే వాళ్ళకి గృహనిర్మాణం కూడా ఉంటుంది. అక్కడి వాళ్ళు ఎవ్వరు కూడా హైదరాబాద్ వరకు రాకుండా అన్ని ఏర్పాట్లు ఉండేట్లు క్లస్టర్లు ఉంటాయని అన్నారు. గతంలోని సీఎం క్యాంపు కార్యాలయాన్ని స్టేట్ గెస్ట్ హౌస్ గా మారుస్తామని అన్నారు.యువతకు అవసరమైన స్కిల్స్ పెంచేందుకు ప్రత్యేక విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేస్తాం. అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు కలిగిన ....ప్రముఖ పేరున్న పారిశ్రామిక వేత్తల ద్వారా ఈ స్కిల్స్ పై శిక్షణ ఉంటుంది.సాధారణ డిగ్రీలకు ఉండే అర్హతలన్నీ ఉంటాయి, స్కిల్స్ అదనంగా ఉంటాయి. అక్కడ నుంచి బైటకి వెళ్ళేవాళ్ళకి క్యాంపస్ లోనే ఎంపిక ఉంటుంది. ఇప్పటికే అధికారాన్ని వికేంద్రీకరించాం. మంత్రులను ఉమ్మడి జిల్లాలకు ఇంచార్జి లుగా బాధ్యతలు అప్పగించాం. 100 బెడ్స్ ఆస్పత్రి ఉన్న చోట నర్సింగ్ కళాశాల ఉంటుంది. విదేశాలకు వెళ్లే యువతకు ఓరియంటేషన్ ఇప్పిస్తాం. ఆయాదేశాలకు అవసరమైన మాన్ పవర్ ను ప్రభుత్వం ద్వారా అందిస్తాం. ఇందువల్ల యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తాం. మన వద్ద పెద్ద సంఖ్యలో యువత ఉంది...వారికీ ఆసక్తి కలిగిన విభాగాల్లో శిక్షణ ఇప్పిస్తాం. చాలా మంది సీనియర్ అధికారులు ప్రావిణ్యం కలిగిన వారికి శిక్షణ ఇప్పించే అవకాశం ఉందని అన్నారు.3వ తేదీన పీసీసీ విస్తృతస్థాయి సమావేశం ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పదవులు ఇస్తాం. పార్టీ కోసం పనిచేసిన వారితో నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తాం. నాకు దగ్గరనో భందువులనో పదవులు ఇచ్చేది ఉండదు. నేను ఏది చేసినా విస్తృతస్థాయి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పదవులు భర్తీ చేస్తామని అన్నారు.పార్టీ కోసం పని చేసిన వారికీ పదవులు ఇస్తాం. ప్రెస్ అకాడమీ చైర్మన్ భర్తీ చేసిన తర్వాత జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం . హైదరాబాద్ కమిషనరేట్ల కమిషనర్లను నియమించా ....వారికీ అవసరమైన మాన్ పవర్ ను వాళ్ళే పిక్ చేసుకుంటారు. శాఖలకు ప్రతిభ కలిగిన అధిపతులను నియమించడం వరకు నేను చూస్తా. వాళ్ళ పరిధిలో అవసరమైన అధికార్లను నియమించుకుని యంత్రాంగం సక్రమంగా పనిచేసేట్లు చూసుకోవాలని అన్నారు.అధికార్ల నియామకాల్లో సామాజిక న్యాయం కూడా జరిగేట్లు చూస్తాం. సంస్కరణలు తీసుకొచ్చి స్ట్రీమ్ లైన్ చేసే పనిలో ఉన్నా. నా వద్ద చెప్పేది ఒకటి చేసేది ఒకటి ఉండదు. జర్నలిస్టులకు సంబంధించి సమస్యను పూర్తి స్థాయి లో పరిష్కరిస్తాం. ఇప్పటి నుంచి వంద రోజుల్లో పరిష్కరిస్తామని అన్నారు.

## అయోధ్యలో బాలరాముడి
# విగ్రహా ఎంపిక పూర్తి

### కొలువుతీరనున్న51 అంగుళాల శ్యామవర్ణ విగ్రహం



**న్యూ ఢిల్లీ జనవరి 01:**-ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న అయోధ్య బాలరాముడి విగ్రహ ఎంపిక పూర్తయ్యింది. ముగ్గురు శిల్పులు చేసిన విగ్రహాల్లోంచి ఒక విగ్రహాన్ని ఫైనల్ చేశారు. మైసూర్ కు చెందిన అరుణ్ యోగిరాజ్ విగ్రహాన్ని ఎంపిక చేసింది ఆలయ ట్రస్టు. మిగిలిన రెండు విగ్రహాలకు అయోధ్య ఆలయంలోనే చోటు కల్పించనున్నారు. మైసూర్ కు చెందిన అరుణ్ యోగిరాజ్ చేసిన విగ్రహం ఎంపికయ్యింది. అరుణ్ యోగిరాజ్ ఆరు నెలల్లోనే విగ్రహాన్నితయారు చేశారు. ఈ విగ్రహం 51 అంగుళాల ఎత్తుతో శ్యామవర్ణ రూపంలో దర్శనమిస్తుంది. అయోధ్యలోని గర్భగుడిలో ప్రతిష్టించేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మూడు విగ్రహాలను తయారు చేయించింది. వీటిలో రెండు మూడు రోజుల క్రితం మౌఖిక ఓటింగ్ ద్వారా విగ్రహాన్ని ఎంపిక చేసే ప్రక్రియను పూర్తి చేసింది. ధర్మకర్తల మండలి తమ అభిప్రాయాన్ని లిఖితపూర్వకంగా ట్రస్ట్ కు అందజేసింది. ఈ మేరకు ట్రస్ట్ తన తుది నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ విగ్రహాలను ఎంపిక చేసే ప్రక్రియ కూడా ఆశామాషిగా ఏమీ జరగలేదు. ట్రస్ట్ ట్రస్టీల బోర్డులోని 11మంది సభ్యులు ముగ్గురు శిల్పులతో దాదాపు అరగంట పాటు సంభాషించారు.విగ్రహ తయారీ గురించి అనేక విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చెంపత్రాయ్ తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా ట్రస్ట్ కి తెలియజేశారు. ఈ మూడు విగ్రహాలను కర్ణాటకకు చెందిన ప్రఖ్యాత శిల్పులు గణేష్ భట్ ఒకటి, అరుణ్ యోగి రాజ్ ఒకటి.. మరొకటి రాజస్థాన్ కు చెందిన సత్యనారాయణ్ పాండేలు తయారు చేశారు. విగ్రహాల తయారీకి కర్ణాటక శిల్పులు నల్లరాళ్ళను ఉపయోగించారు. రాజస్థాన్ కు చెందిన సత్యనారాయణ్ పాండే తెల్లని మకరానా పాలరాయితో విగ్రహాన్నిరూపొందించారు. ముంబైకి చెందిన ప్రముఖ కళాకారుడు వాసుదేవ్ కామత్ ఇచ్చిన స్కెచ్ ఆధారంగా రాంలల్లా విగ్రహాలను రూపొందించారు. ఇక గర్భగుడిలో ప్రతిష్టించే ఈ విగ్రహాన్ని భక్తులు 35 అడుగుల దూరం నుంచి మాత్రమే దర్శించుకోవడానికి వీలు ఉంటుంది. జనవరి 16నుంచి అయోధ్యలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు మొదలవుతాయి 17వ తేదీన బాలరాముడు విగ్రహాన్ని అయోధ్యలో ఊరేగిస్తారు. జనవరి 20వ తేదీన సరయూ నది జలాలతో రామ మందిరాన్ని శుద్ధి చేసి అదే రోజు వాస్తు పూజలు నిర్వహిస్తారు. 21వ తేదీన బాలరాముడు విగ్రహాన్ని సంప్రోక్షణ చేసి 22వ తేదీన పూజల అనంతరం మృగశిర నక్షత్రంలో మధ్యాహ్న సమయంలో బాల రాముడు విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేస్తారు.

## ఎల్ఐసి 2024 డైరీని ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ జనవరి 1:**బీనూతన సంవత్సరం సందర్భంగా ఎల్ఐసి చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ లయన్ కె ఎన్ సామ్రాట్ ఆద్వర్యం లో హిమాయత్ నగర్ బ్రాంచ్ తరపున రూపొందించిన నూతన సంవస్సతరం 2024 డైరీని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఆయన నివాసం లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థలో గత 20 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందించి 4000 పైగా పాలసీలను చేయించిన సామ్రాట్ చేస్తున్న సేవలను అభినందించారు. ప్రతి ఒక్కరూ తమ జీవితాలను భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎల్ఐసి పాలసీలు తీసుకుని కుటుంబాలకు రక్షణ కల్పించాలని మంత్రి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు చిక్క దేవదాసు,బీసీ సంక్షేమ సంఘం మహిళా రాష్ట్ర కన్వీనర్ బిల్లా దీపిక, ఆదర్శ కిరణం ఎడిటర్ వంగాల బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## శిష్యుడు రేవంత్ బాటలోనే
# గురూజీ చంద్రబాబు

### టిడిపి ఆరు గ్యారంటీ హామీలు



**విజయవాడ జనవరి 01:**-తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తన శిష్యుడు రేవంత్ రెడ్డి అనుసరించిన వ్యూహాన్నే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఫాలో అవుతున్నారు. కేసీఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ ను ఓడించేందుకు ఆరు గ్యారంటీ హామీలు కాంగ్రెస్ కు చాలా ఉపయోగపడ్డాయి. ఇలాగే ఆంధ్ర ప్రదేశ్ లో కూడా వైసిపిని ఓడించి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గద్దె దింపేందుకు చంద్రబాబు కూడా ఆరు గ్యారంటీలతో తొలివిడత మేనిఫేస్టో విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు ఆరు గ్యారంటీ హామీలను గుర్తుచేసారు. సంక్షేమం, అభివృద్ధి రెండు చక్రాలపై సాగే సుపరిపాలన కోసం, పేదరికంలేని సమాజం నిర్మాణం కోసం సమగ్ర పథకాల రచిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటికే టిడిపి ఆరు గ్యారంటీలను ప్రకటించింది... మలివిడతగా టిడిపి, జనసేన కలిసి రాష్ట్ర దశదిశ మార్చే సమగ్ర మేనిఫేస్టోను రూపొందిస్తున్నట్లు తెలిపారు. అతి త్వరలో టిడిపి-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. ఈ నూతన సంవత్సరంలో మరో నూరు రోజుల్లోనే ఆటవిక పాలన నుండి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభిస్తుందని చంద్రబాబు అన్నారు. నాలుగున్నరేళ్ల నరకం 2023 లో పరాకాష్టకు చేరింది... అన్నింటినీ ప్రత్యక్షంగా అనుభవించాం, భరించామని అన్నారు. కానీ ఈ కొత్త సంవత్సరంలో ఈ నరకం నుండి విముక్తి పొందే అవకాశం వస్తుంది... దీన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. శతాధిక తప్పిదాల శిశుపాలుడిపై ఓటు అనే సుదర్శన చక్రం ప్రయోగించాలని... జగన్ ను సాగనంపేందుకు సిద్దంకావాలని ప్రజలకు సూచించారు చంద్రబాబు. కొత్త సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త వెలుగులు, సిరిసంపదలు, శాంతి భద్రతలు, ఆయురారోగ్యాలు నింపాలని చంద్రబాబు కోరుకున్నారు. కోటి ఆశలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదామని అన్నారు. గతించిన కాలం దుర్భరంగా ఉన్నప్పుడు ఆ చేదు జ్ఞాపకాలు త్వరగా మరిచిపోవాలని... అలాంటి రోజులు మళ్లీ వెంటాడకుండా జాగ్రత్త పడాలని అన్నారు. మంచి రోజుల కోసం మంచి నిర్ణయాలు తీసుకోవాలని నూతన సంవత్సర ఆరంభంలో సంకల్పిద్దామని చంద్రబాబు పేర్కొన్నారు. తెలుగు జాతిని, ఖ్యాతిని ఏ శక్తి అడ్డుకోకుండా చూసే పూచీ తాను తీసుకుంటానని అన్నారు. ఒక్క అవకాశం అని ప్రాధేయపడితే నమ్మి అర్హతలేని వారిని అందలమెక్కించి నష్టపోయాం... అలాంటి తప్పు తిరిగి చేయవద్దని అన్నారు. హింస, అశాంతి , అక్రమాలు, అమానుషాలు,అవినీతి లేని ఆధునిక ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణానికి పునాదులు వేద్దామని... విశ్వ వినువీధుల్లో తెలుగు జాతి జయపతాక రెపరెపలాడిద్దామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## ప్రతి ఇంట్లో అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలి



### డిప్యూటీ సీఎం రాష్ట్ర ప్రజలకు ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క

**హైదరాబాద్:** రాష్ట్ర ప్రజలకు ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024లో ఇంటింటా ఆనందాలు వెల్లివిరాయలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలన్నారు. ప్రజలందరికీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలవుతున్నాయని చెప్పారు. అవినీతి రహిత, పారదర్శక పాలన అందజేస్తామన్నారు. తప్పకుండా ప్రజా పాలన అందిస్తామని తెలిపారు.

## ఇస్రో శాస్త్రవేత్తలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు



### పీఎస్ఎల్వీ-58 ప్రయోగం విజయవంతం..

హైదరాబాద్: భారత అంతరిక్ష సంస్థ(ఇస్రో) చేపట్టిన పీఎస్ఎల్వీ–సీ58 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాకెట్ విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేతలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ సీఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.అమెరికా తర్వాత బ్లాక్ హోల్స్‌ను అధ్యయనం చేయడానికి అబ్జర్వేటరీ ఉపగ్రహం ఉన్నరెండో దేశంగా భారతదేశం అవతరించిందన్నారు. కొత్త సంవత్సరం రోజున మిషన్‌ను విజయవంతంగా ప్రయోగించడంతో ఇస్రో రోదసిలో భారతదేశ పతాకాన్ని ఎగుర వేసిందన్నారు. పీఎస్ఎల్వీ– సీ58 విజయవంతంగా ప్రయోగించడంతో ఇస్రో మరో శిఖరం చేరిందని, భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కేటీఆర్ మధ్యాహ్న భోజనం



**హైదరాబాద్ :** నూతన సంవత్సర వేడుకలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. వారితో కాసేపు ముచ్చటించిన కేటీఆర్.. అనంతరం కలిసి భోజనం చేశారు. కార్మికులతో సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఇక కేటీఆర్‌ను పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## మల్లన్న క్షేత్రానికి పోటెత్తిన భక్త జనం

**చేర్యాల, జనవరి 1 :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి క్షేత్రం ) సోమవారం భక్తుల తో కిటకిటలాడింది. స్వామి వారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 20వేల మందికి పైగా భక్తులు కొమురవెల్లికి తరలివచ్చినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. కొత్త సంవత్సరం మొదటి రోజు కావడంతో సైతం చేర్యాల, సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, జనగామ, బచ్చన్నపేట, కరీంనగర్ తదితరల ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. కాగా, ప్రతి ఏటా మొక్కులు చెల్లించుకునే భక్తులు భక్తులు శనివారం ఉదయం నుంచే మల్లన్న క్షేత్రానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ నిర్వహణలో ఉన్న గదులతో పాటు ప్రైవేటుగా ఉన్న గదులు రెంట్‌కు తీసుకుని బస చేశారు. ఆదివారం వేకువజామునే నిద్రలేచి కోనేటిలో పవిత్ర స్నానం అచరించి, నేరుగా స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లలో గంటల పాటు వేచి ఉండి స్వామి వారిని దర్శించుకుని కోరికలు తీర్చాలని వేడుకున్నారు.

వార్తాతరంగాలు
మంగళవారం 02 జనవరి 2024

# సంపాదకీయం

## ఇన్నేళ్ళ నిర్బంధం ఇక తొలుగుతుందా?

కొన్నిసార్లు మనం కోల్పోయిందేమిటో మనకు తెలియదు. ఎందుకు కోల్పోయామో తెలియదు. అలాంటప్పుడు ఏం సాధించాలో తేల్చుకోవడం కష్టం. పదేళ్ల కేసీఆర్ పాలన తర్వాత తెలంగాణ ఈ విషయాల్లో లోతైన ఆత్మావలోకనం చేసుకోక తప్పదు. ఆంధ్రా వలస పాలనలో తెలంగాణ ఆత్మగౌరవంతో సహా ఒక ప్రాంతంగా సమాన అవకాశాలన్నిటినీ కోల్పోయింది. అయినా సామాజిక, రాజకీయ చైతన్యాన్ని, ప్రతిఘటనా స్ఫూర్తిని పదిలంగా కాపాడుకుంది. కానీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక సాధించుకున్న వాటికంటే కోల్పోయినవే ఎక్కువ. తెలంగాణకు చాలా సహజమైన ప్రజాస్వామిక భావజాల సంఘర్షణ ఈ పదేళ్లలో ఎట్లా దెబ్బతినిపోయిందో ఈ ప్రాంతం పరిశీలించుకోవలసి ఉన్నది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి తానే నాయకత్వం వహించానని బీఆర్ఎస్ చెప్పుకొనేది. అలాంటి పార్టీ పాలనలో ప్రజాస్వామ్యం అడుగంటిపోయింది. ఇది పెద్ద విషాదం! ఈ స్థితిలో కూడా తెలంగాణ ప్రజలు ఎంతో కొంత నిరసనను వ్యక్తం చేస్తూనే వచ్చారు. అయితే అందులో మునుపటి ఉత్తేజం లేదు, ధిక్కారం లేదు. కేసీఆర్ ఆర్థిక విధానాలతో సహా నిర్బంధం కూడా గతంలాగే వెంటాడింది. వీటిని వేరు చేసి ప్రజాస్వామ్యాన్ని చూడలేం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలంలో మారుమూల పల్లె దాకా తెలంగాణ ఎంత ఉద్రిక్తంగా ఊగిపోయింది? రాష్ట్రం ఎందుకు అవసరమో ఎన్ని రకాల కొత్త వాదనలు కింది నుంచి పుట్టుకొచ్చాయి? ప్రజలు ఎంత సృజనాత్మకంగా వ్యక్తమయ్యారు? సమాజం సజీవంగా ఉందనడానికి ఇదంతా గుర్తు. అదే సమయంలో ఉద్యమంలోని ఆటుపోట్లను అర్థం చేసుకోలేకనే కావచ్చు యువత అత్మహత్యలకు పాల్పడింది. అర్థాంతర మరణాలు, హత్యలు, ఆత్మహత్యలు లేని తెలంగాణ కోరుకున్న జనం దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆ విషాద స్థితిలోనే రాష్ట్రం వచ్చింది. దీన్నుంచి బైటపడక ముందే 2015 ఏప్రిల్ 7న వరంగల్ జైలు నుంచి తీసికెళ్తూ ఐదుగురు ముస్లిం యువకులను పోలీసులు కాల్చేశారు. దీని మీద ఎంఐఎం కూడా ఏమీ మాట్లాడలేదు. ఆ తర్వాత 2015 జూన్ 15న వివేక్ అనే తెలంగాణ విద్యార్థిని పోలీసులు కాల్చి చంపారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో వరంగల్ జిల్లా తాడ్వాయి అడవుల్లో విద్యాసాగర్, శృతి ఎన్‌కౌంటర్ జరిగింది. 2016 మార్చిలో చత్తీస్‌ఘడ్‌లోని బెట్టెంతోగు అనే ప్రాంతంలో ఆరుగురు పక్క రాష్ట్రం వాళ్లతోపాటు తెలంగాణకు చెందిన యూసుబ్‌బీ, సృజన, దలసరి సారక్క (తెలంగాణ ఆదివాసీ) అనే ముగ్గురు యువతుల హత్యలను మర్చిపోవడానికి లేదు. ఇక ఆ తర్వాత ఈ జాబితా చాలా పెరిగిపోయింది. వివేక్ హత్యకు తెలంగాణ ప్రభుత్వానికి సంబంధం లేదని అప్పట్లో పాలక ఆశ్రిత మేధావులు అన్నారు. కానీ అప్పటికే కేసీఆర్ ప్రభుత్వం విప్లవోద్యమం మీదికి పోలీసు బలగాలను మోహరించింది. చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో, గోదావరి తీరమంతా పోలీసు క్యాంపులు పెట్టింది. వెంటాడి హత్యలు చేయడానికి పురికొల్పింది. పైన చెప్పిన ఘటనలే కాదు, 2016 జూన్‌లో ఆదిలాబాద్ జిల్లాలో ముగ్గురు ఆదివాసీ, దళిత యువకులు శోభన్ తదితరులను ఎన్‌కౌంటర్ పేర కాల్చేశారు. ఆ సమయంలో తెలంగాణ పోలీసు ఉన్నతాధికారి ఆ ప్రాంతంలోనే ఉన్నాడని పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ అణచివేత మావోయిస్టుల దగ్గరే ఆగలేదు. 2019 జులై 19న సీపీఐ న్యూ డెమోక్రసీకి చెందిన లింగన్న అనే ఆదివాసీ నాయకుడ్ని కాల్చేశారు. జనశక్తి పార్టీకి చెందిన 9 మందిని టేకులగూడెం ప్రాంతంలో కాల్చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పోలీసులే ఈ ఘటనలకు పాల్పడ్డారు. పక్క రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ జరిగిన సందర్భాల్లో అంత్యక్రియల్లో కుటుంబ సభ్యులను వేధించారు. సంస్మరణ సభలు కాదు కదా, పదో రోజు పది మంది కలిసి కన్నీరు కార్చకుండా అడ్డుకున్నారు. కరోనాతో అడవిలోనే చనిపోయిన మావోయిస్టు నాయకుడు హరిభూషణ్ కుటుంబ సభ్యులు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం పదో రోజు జరుపుకోవాలని ఏర్పాటు చేసుకుంటే తెలంగాణ పోలీసులు దాన్ని జరగనివ్వలేదు. ఆ రోజు పోలీసులు ఎంత దుర్మార్గానికి పాల్పడిందీ ప్రస్తుత గిరిజన సంక్షేమ మంత్రి సీతక్కకు అందరికన్నా బాగా తెలుసు. కరోనా కాలంలో కూడా ఆరుగురు తెలంగాణ కార్యకర్తలను టీఆర్ఎస్ ప్రభుత్వం కాల్చేసింది. మావోయిస్టుల మీది నిర్బంధమే తెలంగాణలో ప్రజాస్వామ్య పతనానికి ఏకైక సూచిక కాకపోవచ్చు. ప్రజాస్వామ్యం అనే అత్యద్భుత భావనను గత పదేళ్లలో అనేక వైపుల నుంచి దెబ్బతీస్తూ వచ్చారు. రైతులకు సంకెళ్లు వేసి వేధించారు. ఆర్టీసీ కార్మికుల మీద ప్రభుత్వం ఒక యుద్ధమే చేసింది. లెక్కకు మిక్కిలి జరిగిన పౌరహక్కుల ఉల్లంఘనలకు గరిష్టంగా విప్లవ రాజకీయాలనే సాకు చేసుకున్నారు. మావోయిస్టు పార్టీ మీద నిషేధం ప్రజాస్వామ్య విధ్వంసానికి కేంద్రంగా పని చేసింది. అందువల్ల ప్రజలు తమకు ఇష్టమైన రాజకీయాలను ప్రకటించుకొనే వీలు లేకుండా చేశారు. ఇష్టమైన సంఘాల్లో, పార్టీల్లో ఉండటం నేరమని వెంటాడి హత్యలు చేశారు. అరెస్టులు చేసి జైళ్లలో తోశారు. మావోయిస్టు పార్టీ పదేళ్ల వార్షికోత్సవ సభను జరగనివ్వకుండా ముందు రోజే వందలాది మందిని అరెస్టు చేశారు. సాగర్, శృతి ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా 200 సంస్థలతో తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరసన కార్యక్రమంపై ఉక్కుపాదం మోపారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కార్యాలయానికి పోలీసులు తాళం వేసుకొని వెళ్లిపోయారు. చివరికి కోదండరాం ఒక సభను తలపెడితే దాన్ని జరగనివ్వకుండా ఆయన ఇంటి మీద దాడి చేసి తలుపులు బద్దలు కొట్టారు, అరెస్టు చేశారు. గత ప్రభుత్వాలకంటే నాలుగు ఆకులు ఎక్కువ చట్ట వ్యతిరేకంగా ఈ పదేళ్ల పాలన సాగింది. ప్రజలకు రాజకీయ జీవితం లేకుండా చేయాలని అనుకోవడంలోనే ప్రజాస్వామ్య పతనం ఉంది. మావోయిస్టు రాజకీయాలకు అవకాశం లేకుండా చేయడంతో కేసీఆర్ ఈ పని మొదలుపెట్టాడు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్ తెలంగాణ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్‌గా మారిపోయింది. ఆ తర్వాత అదే చట్టం కింద పదహారు ప్రజాసంఘాలను టీఆర్ఎస్ ప్రభుత్వం నిషేధించింది. దానికి కూడా మావోయిస్టులతో సంబంధం అనే ఆరోపణ తప్ప ఆధారాలేవీ లేవు. అనేక రాజకీయ విశ్వాసాల, ఆచరణ రూపాల కూడలిగా వర్ధిల్లిన తెలంగాణను కేసీఆర్ ఏం చేశాడో, తెలంగాణ ఏం కోల్పోయిందో గుర్తిస్తే తప్ప ప్రజాస్వామ్య పునరుద్ధరణ సాధ్యం కాదు. కొత్త ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధర్నా చౌక్ గురించి మాట్లాడుతున్నారు. అక్కడ మావోయిస్టు రాజకీయ వ్యక్తీకరణకు చోటు ఉంటుందా? రాడికల్ విద్యార్థి సంఘం, సింగరేణి కార్మిక సమాఖ్య వంటి సంఘాలకు అవకాశం ఉంటుందా? ప్రతిపక్ష పార్టీ నుంచి ఇలాంటి సంస్థలన్నిటికీ చోటు ఉంటేనే కదా భావవ్యక్తీకరణ నిండైన అర్థాన్ని సంతరించుకొనేది. భావ ప్రకటన సాహిత్య కళా మేధో రంగాలకు సంబంధించిందే కాదు. మౌలికంగా అది రాజకీయ ఆచరణ. ఏ రాజకీయ ఆచరణకైనా చోటు ఉండాలి. మావోయిస్టుల దగ్గర తుపాకులు ఉన్నాయనే సాకుతో రేషన్ పద్ధతిలోకి ప్రజాస్వామ్యాన్ని కుదించడానికి లేదు. హింసను నిరోధించడానికి ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తయారు చేసుకున్నాయి. అయినా రాజకీయాల మీద, సంస్థల మీద నిషేధం పెట్టి పోలీసులు హింసకు పాల్పడటం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. తన పాలనలో రాజకీయాల మీద నిషేధం ఉండటం ఏమిటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచించాలి. ఒక అక్రమ చట్టం ద్వారా నిషేధాన్ని కొనసాగిస్తూ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తానని అనడం ఎంత అసంబద్ధమో ఆయన గ్రహించాలి. బీజేపీతో కేసీఆర్ సఖ్యంగా మసలుకోవడంతో పెరిగిపోతున్న మతతత్వ శక్తుల మధ్య కొద్ది మెజారిటీ మాత్రమే ఉన్న తన ప్రభుత్వం కొనసాగాలన్నా సమాజం రాజకీయ చైతన్యంతో సజీవంగా ఉండాలి. అనేక భావాల వ్యక్తీకరణకు చోటు ఉండాలి. కాబట్టి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ శక్తులను నిలువరించడానికి ఇప్పటి నుంచే జరగవలసిన ప్రజాస్వామిక ఆందోళనలో మావోయిస్టుపార్టీ మీద, దాని అనుబంధ సంఘాల మీద నిషేధం ఎత్తివేత ఒక ముఖ్యమైన అంశం కావాలి. మిగతా అన్ని రకాల ఆంక్షలు, నిర్బంధాలు, అప్రజాస్వామిక చట్టాలు తొలగిపోవాలని కోరుకోవాలి. అప్పుడే తెలంగాణ తనను తాను ఆవిష్కరించుకుంటుంది.

# తెలంగాణ రాజకీయాల్లో డార్లింగ్

**హైదరాబాద్, జనవరి 1:**సలార్ మూవీ ఇంపాక్ట్ పొలిటికల్ వర్గాల్లో మాములుగా లేదు. ఓ వైపు బాక్స్ ఆఫీస్ ఊచకోతతో ఫ్యాన్స్ లో పూనకాలు వచ్చేస్తుంటే , మరో వైపు రాజకీయ నాయకులు సలార్ మూవీలో సాంగ్తో వీడియో చేస్తూ ఫ్యాన్స్ ను మరింత ఖుషీ చేసేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి కోమటిరెడ్డి కూడా సలార్ సినిమాలోని సూరీడే గొడుగు పట్టి సాంగ్‌కు ఫిదా అయ్యారు.ఆ పాటకు పొలిటికల్ వీడియో క్లిప్పింగ్స్ యాడ్ చేయడంతో ఇప్పుడు ఆ పాట మరింత వైరల్ గా మారింది.తెలంగాణ రాజకీయాలపై డార్లింగ్ ప్రభాస్ గట్టిగానే ఇంపాక్ట్ చూపిస్తున్నాడు. మొన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పుడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూరీడే గొడుగు పట్టి సాంగ్‌కు ఫిదా అయ్యారు. సలార్ మూవీలోని స్నేహానికి సంబంధించిన "సూరీడే గొడుగు పట్టి" అనే పాట అందరి మనసులను దోచుకుంటోంది. ఈ క్రమంలోనే.. సీఎం రేవంత్ రెడ్డి తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఆ పాటకు సంబంధించిన కొన్ని లిరిక్స్‌తో పాటు రాహుల్‌గాంధీతో పాటు తాను ఉన్న వీడియోను కూడా పోస్ట్ చేశారు. అది బీభత్సమైన వైరల్ గా మారింది. .. ఇప్పుడు మంత్రి కోమటిరెడ్డి కూడా ఆ పాటకు సంబంధించిన లిరిక్స్‌ను ట్వీట్ చేయటం గమనార్హం. ఆ లిరిక్స్‌కు తగ్గట్టుగా.. ఆయనతో పాటు సీఎం రేవంత్ రెడ్డి ఫొటోలను కలిపి.. ఎడిటింగ్ చేసిన వీడియోను కూడా షేర్ చేశారు




కోమటిరెడ్డి.సినిమా అంటే ..సినిమా అంతే. సినిమా ప్రభావానికి గురికాని మనుషులు ఉంటారా ?వేగమొకడు.. త్యాగమొకడు.. గతము మరువని గమనమే, ఒకరినొకరు నమ్మి నడిచిన బంధమే ఇదిలే, ఒకరు గర్జన.. ఒకరు ఉప్పెన.. వెరసి ప్రళయాలే, సైగ ఒకరు.. సైన్యం ఒకరు.. కలిసి కదిలితే కదనమే%ొా% అన్న లిరిక్స్‌ను కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్వీట్ చేశారు. కాగా.. కోమటిరెడ్డి చేసిన ఈ ట్వీట్ ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గతంలో ఒకరిపై ఒకరు బహిరంగ విమర్శలు చేసుకున్న నేతలు.. ఇలా స్నేహానికి సంబంధించిన పాటను షేర్ చేయటంపై రకరకాల కామెంట్లు వినిపిస్తున్నాయి.

**"కలిసి కొత్త శకాన్ని నిర్మిద్దాం" మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ట్వీట్**

అయితే.. నిన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సంబంధించిన ఫొటోను కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి షేర్ చేశారు. "కలిసి కొత్త శకాన్ని నిర్మిద్దాం".. అంటూ భట్టి విక్రమార్కతో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలో ఈ మార్పు దేనికి సంకేతం.. దీని వెనుక కారణమేంటీ.. అన్న ఆలోచనలో పడ్డారు కాంగ్రెస్ శ్రేణులు.బొకేలకు, శాలువాలకు పెట్టే ఖర్చును సీఎం రీలీఫ్ ఫండ్ కు ఇవ్వండి నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు రాష్ట్ర ప్రజలకు.. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మంత్రి.. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి.. తనను కలవడానికి వచ్చే నాయకులందరికి ఒక విన్నపం చేశారు. బొకేలకు, శాలువాలకు పెట్టే ఖర్చును సీఎం రీలీఫ్ ఫండ్ కు ఇస్తే నిరుపేదలకు ఉపయోగపడుతుందని వివరించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు లీడర్ల చుట్టూ తిరగాల్సిన పనిలేదని.. ప్రజాపాలన ద్వారా ఇతర కార్యక్రమాల ద్వారా తామే జనాల ముందుకు వచ్చి సమస్యల్ని తెలుసుకొని పరిష్కారిస్తామని తెలిపారు.

# తెగ తాగేశారు..

**హైదరాబాద్:**తెలంగాణలో మందుబాబులు గత ఏడాది తెగతాగేశారు. డిసెంబర్ నెలలో అయితే రికార్డులు సృష్టించారు. కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు గిఫ్ట్ ఇచ్చారు. తమ జేబులు గుల్లచేసుకుని ప్రభుత్వాల ఖజానా నింపే ప్రయత్నం చేశారు. తెలంగాణలో డిసెంబర్ చివరి వారంలో రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు జరిగాయని లెక్కలు చెబుతున్నాయి.తెలంగాణలో న్యూ ఇయర్ సందర్భంగా లిక్కర్ సేల్స్ జోరుగా సాగాయి. మూడు రోజుల్లో రూ.625 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. న్యూ ఇయర్ సందర్భంగా అర్ధరాత్రి 12 గంటల వరకు లిక్కర్ షాపులు, వైన్స్‌కి అనుమతి ఇవ్వడం, బార్‌లకు ఒంటి గంట వరకు ఓపెన్ ఉండడంతో మందుబాబులు పండగ చేసుకున్నారు. డిసెంబర్ 28న రూ.133 కోట్లు, 29న రూ.179 కోట్లు, 31న అత్యధికంగా రూ.313 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి.న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ పేరుతో తెలంగాణలో మద్యం ఏరులై పారింది. వేడుకల పేరుతో జనం విచ్చలవిడిగా మద్యం కొనుగోలు చేశారు. 2023 డిసెంబర్ 31న పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ చేసుకున్నసంబరాలు ప్రభుత్వ ఖజానను నింపాయి. తెలంగాణలో ఒక్కరోజే 313కోట్ల రూపాయల లిక్కర్ అమ్ముడైంది. ఒక్కరోజులో మద్యం విక్రయాలు జరిగిన తీరు ఇప్పుడు అందర్ని ముక్కున వేలేసుకునేలా చేస్తోంది.

**1060 కేసులు**

కొత్త ఏడాది వేడుకల్లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో



ఆదివారం రాత్రి 9 గంటల నుంచి డ్రంకన్ డ్రైవ్ చెకింగ్‌లు చేశారు. సిటీ పరిధిలోని పబ్‌లు, బార్లు, రిసార్ట్స్ వద్ద పోలీసులు పటిష్ట నిఘా పెట్టారు. బేగంపేట, లంగర్ హౌస్ ఫ్లై ఓవర్లు మినహా3 కమిషనరేట్లలోని అన్ని ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ బ్రిడ్జిలను మూసివేశారు. 59 ట్రాఫిక్ పీఎస్‌లలో మొత్తం 260 చెక్ పాయింట్ల వద్ద ముమ్మర తనిఖీలు చేశారు. టీ న్యాబ్ పోలీసులు డ్రగ్ డిటెక్టర్లతో తనిఖీలు నిర్వహించారు. నక్లెస్ రోడ్స్, ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్ బండ్‌వైపు రహదారులను మూసివేసినప్పటికీ సెక్రటేరియట్ వద్దకు యువకులు భారీగా చేరారు. దీంతో పోలీసులు సైతం క్రౌడ్‌ను కట్టడి చేయలేక చేతులు ఎత్తివేశారు.మరోవైపు డ్రగ్ టెస్టుల్లో భారీగా కేసులు నమోదయ్యాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, గచ్చిబౌలిలోని పబ్స్, బార్లు, రెస్టారెంట్‌లలో పోలీసులు మఫ్టీలో వెళ్లి తనిఖీలు చేపట్టారు. స్నిప్పర్ డాగ్స్ ను కూడా తమ వెంట తీసుకెళ్లారు. నిబంధనలు ఎంతవరకు పాటిస్తున్నారనే దానిపై పరిశీలించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్న వారి కోసం సెర్చ్ చేశారు. చెక్ పాయింట్స్ వద్ద 3 కమిషనరేట్ల పరిధిలో డ్రగ్స్ టెస్టులు చేశారు. దీంతో రాత్రి 11.30 గంటల వ్యవధిలోనే అంటే కేవలం రెండున్నర గంటల్లోనే మొత్తం 1060 కేసులు నమోదు చేశారు. పోలీసుల తనిఖీల్లో నలుగురు డ్రగ్స్ సప్లయర్లు పట్టుబడ్డారు. డ్రంకన్ డ్రైవ్ కేసులు, డ్రగ్ టెస్టుల కేసుల వివరాలను ఈ రోజు మీడియా సమక్షంలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.ఏపీలో మరో ఘటన.. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి ప్రకాశం జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్, బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు యువకులు మృతి చెందారు. ఈ ప్రమాదం బేస్తవారపేట మండలం శెట్టిచెర్ల అడ్డరోడ్డు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేస్తవారపేట పంచాయతీ పాపాయిపల్లికి చెందిన పవన్ (20), శ్రీనివాస్ (21), రాహుల్ (21) ముగ్గురూ ద్విచక్ర వాహనంపై పందిళ్లపల్లి సమీపంలోని టోల్‌ప్లాజా వైపుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో గిద్దలూరు నుంచి బేస్తవారపేట వైపు వస్తున్న బొలెరో వాహనం వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# అంబరాన్నంటిన సంబరాలు

**హైదరాబాద్, జనవరి 1:**తెలంగాణలో కొత్త సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. రాష్ట్రవ్యాప్తంగా చిన్నా పెద్దా భేదం లేకుండా అంతా న్యూ ఇయర్ సంబరాలు చేసుకుంటున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా హైదరాబాద్ లోని పలు ఫ్లైఓవర్లను పోలీసులు మూసివేశారు. షేక్ పేట్, మైండ్ స్పేస్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్, సైబర్ టవర్ ఫ్లైఓవర్, రోడ్ నెం.45 ఫ్లైఓవర్, బయో డైవర్సిటీ ఫ్లైఓవర్లు రెండు, గచ్చిబౌలి ఫ్లైఓవర్, ఖైత్లాపూర్ ఫ్లై ఓవర్, ఫోరమ్ మాల్–జెఎన్ టీయూ బ్రిడ్జ లను రాత్రి 11 గంటలకు మూసివేశారు. జనవరి 1న ఉదయం 5గంటల వరకూ క్లోజ్ చేయనున్నారు. అర్ధరాత్రి 12గంటల తర్వాత నగరంలోని ఫ్లైఓవర్లతో పాటు ఓఆర్ఆర్ మూసి వేయనున్నారు. ఫ్లైఓవర్లను మూసివేయనున్న అధికారులు.. ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్‌వైపు రాత్రి 10గంటల నుంచి 2 గంటల వరకు వాహనాల రాకపోకలు నిషేధించారు. ఖైరతాబాద్ మార్కెట్ నుంచి నెక్లెస్ రోటరీ వైపు వెళ్లే వాహనాలను సెన్సేషన్ థియేటర్ మీదుగా లక్డీకాపూల్ వైపు మళ్లించనున్నారు. ఖైరతాబాద్ వి.వి.విగ్రహం కూడలి నుంచి ఫ్లైఓవర్ మీదుగా నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్ వైపు, ఎన్టీఆర్ మార్గ్ నుంచి ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా రాజ్‌భవన్ వైపు వాహనాలకు అనుమతి లేదు. బీఆర్‌కే భవన్ నుంచి ఎన్టీఆర్ మార్గ్ వైపు వెళ్లే వాహనదారులు తెలుగుతల్లి ఫ్లైఓవర్ జంక్షన్ వద్ద ఇక్బాల్ మీనార్, లక్డీకాపూల్, అయోధ్య జంక్షన్ వైపు వెళ్లాల్సి ఉంటుంది.



నెహ్రూ ఔటర్ రింగ్, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్‌పై వెళ్లేవారు విమానం టికెట్ చూపిస్తే ఆర్‌జీఐఏ విమానాశ్రయానికి అనుమతించనున్నారు.డ్రంకన్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, ద్విచక్రవాహనాలపై ట్రిపుల్ రైడింగ్ ఇతర ఉల్లంఘనలను అరికట్టడానికి పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టేందుకు రెడీ అయ్యారు. సరైన పత్రాలు లేకపోతే వాహనాలను స్వాధీనం చేసుకుంటారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మైనర్ డ్రైవింగ్ చేస్తే వాహనాన్ని స్వాధీనం చేసుకుని యజమానిపై కేసు నమోదు చేయనున్నారు. మద్యం తాగి వాహనం నడిపితే కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నారు.నూతన సంవత్సరం సందర్భంగా అర్ధరాత్రి 12.15 గంటల వరకు మెట్రో రైళ్లు అందుబాటులో ఉంటాయి అర్ధరాత్రి 12.15 గంటలకు చివరి మెట్రో రైలు బయలుదేరి 1 గంటకు చివరి స్టేషన్‌కు చేరుకోనుంది. మద్యం తాగి వచ్చినా, దుర్భాషలాడినా కఠిన చర్యలు తీసుకోనున్నారు. మెట్రో రైలు, స్టేషన్లలో సిబ్బంది, పోలీసుల నిఘా పెట్టారు.

# బిర్యాని తింటే కారు వచ్చింది

**తిరుపతి, జనవరి 1:**ఒక్క దమ్ బిర్యానీ తిని, ఏడు లక్షల రూపాయల కారు గెలుచుకున్నాడు ఓ లక్కీ ఫెలో. అదృష్టం కలిసొస్తే పరిస్థితి ఇలా ఉంటుంది. కొత్త సంవత్సరాన్ని కొత్త కారుతో మొదలుపెట్టబోతున్నాడు తిరుపతికి చెందిన ఓ వ్యక్తి. లేకపోతే దమ్ బిర్యానీ తినడం ఏంటి, ఏకంగా లక్షల విలువైన కారును బహుమతిగా గెలుచుకోవడం చూస్తే అదృష్టమంటే అతడిదే అంటున్నారు స్థానికులు. నగరంలోని రోబో హోటల్లో నిర్వహించిన బిర్యాని లక్కీ డ్రా లో రాహుల్ అనే వ్యక్తి నిస్సాన్ మాగ్నట్ కారు ఉచితంగా పొందాడు. గత సెప్టెంబర్ నెలలో రోబో హొటల్ వినూత్న స్కీం ప్రవేశ పెట్టింది. హొటల్ లో బిర్యాని తిన్న ప్రతి ఒక్కరికి కూపన్ అందజేసింది. సుమారు 23 వేలకు పైగా కూపన్లు చేరాయి. నూతన ఏడాదిని పురస్కరించుకొని ఆదివారం రాత్రి హొటల్ అధినేత భరత్ కుమార్ రెడ్డి, నీలిమ దంపతులు హొటల్ ఆవరణలో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో లక్కీ డ్రా కూపన్ తీశారు.

**లక్కీ డ్రాలో నిస్సాన్ మ్యాగ్నెట్ కారు..**

తిరుపతికి చెందిన రాహుల్ ఈ లక్కీ డ్రాలో విజేతగా నిలిచారు. ఆయనకు నిస్సాన్ మ్యాగ్నెట్ కారు ఉచితంగా లభించింది. హొటల్ అధినేతలు స్వయంగా రాహుల్ కు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్ కు కారును అందజేశారు. ఈ సందర్భంగా రోబో హొటల్ అధినేత భరత్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... నగర వాసులకు మరింత చేరువ కావాలన్న ఉద్దేశంతో ఈ వినూత్న స్కీం ప్రవేశపెట్టామన్నారు. తక్కువ ధరలకు నాణ్యమైన వంటకాలు రోబో హొటల్లో అందిస్తున్నామని ఇలాంటి వినూత్న స్కీములు ఇకపై మరిన్ని కొనసాగిస్తామని భరత్ కుమార్ రెడ్డి మీడియాకు తెలిపారు.

# భారీ యాక్సిడెంట్..ముగ్గురి దుర్మరణం

**ఒంగోలు:**ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. బేస్తవారిపేట మండలం లోని అనంతపురం అమరావతి జాతీయ రహదారి పై చెట్టిచర్ల వద్ద ముందు వెల్తున్న బైక్ ను వెనుక నుండి బొలేరో వాహనం ఢీకొంది. ఈ ఘటన లో బైక్ పై ఉన్న ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరు కింద పడి చని మృతి




చెందగా ఒకరు మాత్రం బైక్ లో నుండి వచ్చిన మంటలు అంటుకుని మృతి చెందాడు. మృతులు రాహుల్, శ్రీను, పవన్ గా తెలుస్తోంది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో కంభం నుండి చెట్టిచర్ల వెల్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఘటన పై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

# బెస్ట్ లివింగ్ ప్లేస్ గా భాగ్యనగరం

**హైదరాబాద్, జవనవరి 1:**హైదరాబాద్.. ఓ మహానగరం. వేగంగా అభివృద్ధి చెందుతూ విశ్వనగరంగా రూపుదిద్దుకుంటోంది. దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందినవారు సైతం హైదరాబాద్‌లో స్థిరపడుతున్నారు. వాతావరణం పరంగా, వ్యాపారం పరంగా.. ఐటీ ఉద్యోగాల పరంగా హైదరాబాద్ ది బెస్ట్ అని చెప్పొచ్చు. అయితే, హైదరాబాద్‌లో నివాసం ఉంటే ఖర్చు ఎంత అవుతుంది..? మిగతా మహానగరాలతో పోల్చుకుంటే...? హైదరాబాద్‌లో ఒక కుటుంబం బతకడానికి ఎంత సంపాదన ఉండాలి..? ఈ ఏడాదికి సంబంధించి చేసిన తాజా సర్వేలు ఏం చెప్తున్నాయి..?దేశంలోని మెట్రో నగరాలతో పోలిస్తే మన హైదరాబాద్‌లోనే ఖర్చు తక్కువే. కుటుంబ జీవన వ్యయంతోపాటు ఇంటికి అయ్యే ఖర్చును పరిగణనలోకి తీసుకుంటే... పుణె, కోల్‌కతా తర్వాత స్థానంలో భాగ్యనగరం ఉంది. మిగతా నగరాలతో పోలిస్తే ఇళ్ల ధరలు కూడా హైదరాబాద్‌లోనే తక్కువ. ముంబైతో పాటు దేశ రాజధాని ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో ఇళ్ల ధరలు, అద్దెలు చాలా ఎక్కువ. ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాల్లో జీవన వ్యయం కూడా ఎక్కువ ఖర్చుతో కూడుకున్నదని సర్వేలు చెప్తున్నాయి. మానవ జీవనానికి అవసరమైన అన్ని ముఖ్యమైన సౌకర్యాలను అందించే అత్యుత్తమ నగరాలలో హైదరాబాద్ కూడా ఒకటి. ఇక్కడ వాతావరణం బాగుటుంది.



హైదరాబాద్ వాతావరణాన్ని అన్ని ప్రాంతాల ప్రజలు ఇష్టపడతారు.కాస్ట్ ఆఫ్ లివింగ్‌ను అంచనా వేసేందుకు.... ఉద్యోగం లేదా వృత్తి, బ్యాచ్‌లరా..? కుటుంబమా..? అనేది కూడా లెక్కలోకి తీసుకుంటారు. వారి ఆర్థిక స్థితి, జీవనశైలి, ఖర్చులు వంటివి ఆధారంగా అంచనాలు వేస్తారు. ఆయా ప్రాంతాల్లో ఆస్తుల విలువ.... విద్య, ప్రయాణ, ఇంధన, ఆహార ఖర్చులు, మౌలిక సదుపాయాల వివరాలు తీసుకుని సర్వేలు నిర్వహిస్తారు. ఈ సర్వేల ప్రకారం... హైదరాబాద్‌లో జీవన వ్యయం ఢిల్లీ, ముంబై, బెంగళూరు లాంటి నగరాల కన్నా తక్కువనే చెప్పాలి. ఉదాహరణకు... హైదరాబాద్‌లో సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లు... సుమారుగా 7వేల రూపాయలకే అద్దెకు లభిస్తాయి. అలాగే.. కరెంటు బిల్లు 2వేలు, వైఫైకి వెయ్యి, కిరాణా ఖర్చులు, రవాణా . ఇలా అన్ని ఖర్చులు చూసుకున్నా... నెలకు 20వేల రూపాయలు సరిపోతుందని అంచనా వేస్తున్నారు. మనం ఎంచుకునే ప్రాంతం, అపార్ట్‌మెంట్‌ను బట్టి ఖర్చులు పెరుగుతాయని చెప్తున్నారు. హైదరాబాద్ బ్యాచిలర్స్ ఉండేందుకు ఇల్లు కావాలంటే... 8 వేల వరకు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ఇద్దరు, ముగ్గలు ఇలా కలిసి ఉంటే... అద్దె ఖర్చులు పంచుకునే అవకాశం ఉంది. ఇంటి ఖర్చలు కోసం 4వేల రూపాయలు అవుతుంది. రవాణా ఖర్చులు అయితే... బ్యాచ్‌లర్స్ ప్రజా రవాణా వాడుకోవచ్చు. అప్పుడు ఖర్చు 2వేలకు మించదు. అదే కారులో ప్రయాణిస్తే ఖర్చు పెరుగుతుంది. హైదరాబాద్‌లో ఒక జంట నివాసం ఉండేందుకు సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లు సరిపోతుంది. దీనికి అద్దె నెలకు రూ.8 నుంచి రూ.10 వేలు ఉంటుంది. అంతేకాకుండా... కపుల్స్ కు విద్యుత్, ఇంటర్నెట్, వంట గ్యాస్ ఇలా ఇరత్రా ఇంటి ఖర్చల కోసం డబ్బును ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ఖర్చులు రూ.10,000వేల వరకు ఉంటాయి. ఇక రవాణా కోసం రూ.2వేలపైనే ఖర్చు చేయాల్ని ఉంటుంది. బ్యాచ్‌లర్స్, కపుల్స్‌తో పోలిస్తే... నలుగురు సభ్యులున్న కుటుంబం ఖర్చు అధికంగా ఉంటుంది. పిల్లల విద్య, ఆహారం, ప్రయాణం, వైద్యం కోసం అదనపు ఖర్చులు ఉంటాయి. దీని బట్టి నలుగురు సభ్యులున్న కుటుంబం హైదరాబాద్‌లో జీవించాలంటే సుమారుగా రూ.30,000 నుంచి రూ.50,000 వరకు ఖర్చు అవుతుంది. హైదరాబాద్‌లో కొన్ని ప్రాంతాల్లో మాత్రం రూ. 25,000 బడ్జెట్ సరిపోతుందని చెప్తున్నారు. అయితే... డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కావాలనుకుంటే మాత్రం అద్దె నెలకు 15వేలు ఉంటుందని.. దాన్ని బట్టి ఖర్చులు కూడా పెరుగుతాయని చెప్తున్నారు. ఇలా చూస్తే.. హైదరాబాద్ ఒక బ్యాచ్‌లర్‌కు నెలకు సుమారుగా 18వేల రూపాయలు. అయితే, కపుల్‌కు 22వేలు, ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబానికి 40వేల చొప్పున ఖర్చవుతుందని అధ్యయనాలు తెలుపుతున్నాయి. మరో ప్లస్ పాయింట్ ఏంటంటే... భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన 4వ నగరం హైదరాబాద్. హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, జైనులుతోపాటు అనేత మతాల వారు హైదరాబాద్‌లో ఉంటారు. భిన్నత్వంలో ఏకత్వానికి ఇది చక్కని ఉదాహరణ. హైదరాబాద్ ప్రజలను హైదరాబాదీలు అని కూడా అంటారు. దేశంలోని ఇతర మెట్రోపాలిటన్ నగరాలతో పోల్చినప్పుడు హైదరాబాద్‌లో నేరాల రేటు తక్కువగా ఉంది. వీటన్నింటిని బట్టి హైదరాబాద్ బెస్ట్ లివింగ్ ప్లేస్ అని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

# రాముడి భక్తులకే ఇన్విటేషన్స్

**అయోధ్య, జనవరి 1:**అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి 22న ఈ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే వేలాది మందికి ఆహ్వానం అందింది. అయితే...ఈ ఇన్విటేషన్‌ల విషయంలో కాస్త రాజకీయ రగడ కొనసాగుతోంది. కొంతమంది కీలక నేతలు తమకు ఆహ్వానం అందలేదని అసహనంతో ఉన్నారు. శివసేన చీఫ్ ఉద్ధవ్ థాక్రే ఇప్పటికే ఈ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు ఇన్విటేషన్ పంపలేదని చెప్పారు. ఈ వివాదంపైనే ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ స్పందించారు. కేవలం రాముడి భక్తులకు మాత్రమే ఇన్విటేషన్‌లు పంపామని తేల్చి చెప్పారు. రాముడి పేరు చెప్పుకుని బీజేపీ రాజకీయాలు చేస్తుందన్న విమర్శల్నీ కొట్టిపారేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎక్కడికి వెళ్లినా ఆయనను గౌరవిస్తున్నారని అన్నారు."అయోధ్య ఉత్సవానికి కేవలం రాముడి భక్తులకు మాత్రమే ఆహ్వానం పంపాం. రాముడి పేరు చెప్పుకుని బీజేపీ రాజకీయాలు చేస్తోందనడంలో ఎలాంటి అర్థం లేదు. ప్రధాని మోదీ ఎక్కడికి వెళ్లినా గౌరవం లభిస్తోంది. ఇన్నేళ్ల హయాంలో ఆయన ఎన్నో గొప్ప పనులు చేశారు. ఇది రాజకీయం చేయాల్సిన విషయం



కాదు. ఇది ఆధ్యాత్మిక కార్యక్రమం అని గుర్తుంచుకోవాలి"– ఆచార్య సత్యేంద్ర దాస్, అయోధ్య రామ మందిర పూజారి

**థాక్రేపై ఫైర్..**

అంతకు ముందు ఉద్ధవ్ థాక్రే బీజేపీపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాముడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదని మండి పడ్డారు. మందిర ఉత్సవాన్ని కేవలం ఓ పార్టీకే పరిమితం చేయడమేంటని ప్రశ్నించారు. ఏదేమైనా అయోధ్య రాముడి కోసం మందిరం కట్టడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. అయితే...ఆయనకు ఆహ్వానం అందలేదన్న విమర్శలపై మండి పడ్డారు సత్యేంద్ర దాస్. "రాముడి పేరు చెప్పుకుని ఒకప్పుడు వాళ్లు రాజకీయాలు చేశారు. ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ విషయం బహుశా ఉద్ధవ్ థాక్రే మర్చిపోయారేమో. రాముడిని నమ్ముకున్న వాళ్లే ఇప్పుడు అధికారంలో ఉన్నారు. అయినా ఇలాంటి వాళ్ల మాటలు పట్టించుకోనవసరం లేదు"– ఆచార్య సత్యేంద్ర దాస్, అయోధ్య రామ మందిర పూజారి అయోధ్య రామ్ మందిర్ ట్రస్ట్ పేరు చెప్పి కొందరు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని విశ్వహిందూ పరిషత్ ఫిర్యాదు చేసింది. ఎలాంటి అప్రూవల్ లేకుండానే కొందరు %ు= జశీఎవ%ల ద్వారా పెద్ద మొత్తంలో విరాళాలు సేకరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో పాటు కేంద్రహోం శాఖకూ ఫిర్యాదులు అందించింది. ఆ వ్యక్తులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. %శ% లో అధికారికంగా ఓ పోస్ట్ పెట్టింది. విశ్వహిందూ పరిషత్ జాతీయ ప్రతినిధి వినోద్ బన్సాల్ అందరినీ అలెర్ట్ చేశారు. అలాంటి మాయగాళ్ల వలలో చిక్కుకోవద్దని సూచించారు.

# 22 క్రూయిజ్ కార్ల కహానీ...

**హైదరాబాద్, జనవరి 1:**సరిగ్గా మూడు రోజుల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశంలో బట్టబయలు చేసిన 22 కార్ల కహాని రోజుకో కొత్త మలుపు తీసుకుంటోంది. మొదట్లో ఈ కార్ల గురించి ఎదురుదాడికి దిగిన ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి నాయకులు.. ఆ తర్వాత రోజుకో రకంగా మాట మార్చారు. కార్లు కొనుగోలు చేయలేదని కొంతమంది, కార్లు కొనుగోలు చేస్తే తప్పేంటని, కార్ల కొనుగోలు బాధ్యత ఇంటలిజెన్స్ చూసుకుంటుందని.. ఇలా రకరకాల మాటలు మాట్లాడారు. సరే ఇవన్నీ పక్కన పెడితే ఏడాది క్రితం కొన్న కార్ల కోసం ప్రభుత్వం దాదాపుగా 66 కోట్లు ఖర్చు చేసింది. అంటే ఒక్కో కార్ మీద మూడు కోట్ల వరకు వెచ్చించింది. మరి ఈ స్థాయిలో ఖర్చుపెట్టినప్పుడు అవి విజయవాడలోనే ఇంకా ఎందుకు ఉన్నాయి? వాటిని తెలంగాణకు తీసుకురావడంలో ఎందుకు జాప్యం ఏర్పడుతోంది? అసలు ఇప్పటివరకు ఎన్ని కార్లు తెలంగాణకు వచ్చాయి?మూడోసారి కూడా అధికారంలోకి వస్తామని భావించిన కేసీఆర్ సరిగా ఏడాది క్రితం 22 వాహనాలను బుక్ చేశారు. అవన్నీ కూడా ల్యాండ్ క్రూయిజ్ బ్రాండ్ కు సంబంధించినవి. వీటిని టయోటా కంపెనీ ఎప్పటినుంచో తయారు చేస్తుంది. అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లో 18 ఫార్చునర్ 18 ఫార్చునర్ కార్లను కెసిఆర్ కాన్వాయ్ కోసం కొనుగోలు చేశారు. ఆ బండ్లు మంచి స్టాండర్డ్స్ తో ఉన్నప్పటికీ కొత్తగా 22 కార్లను కొనుగోలు చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే గతంలో కొనుగోలు చేసిన వాహనాలకు కూడా బుల్లెట్ ప్రూఫ్ సౌకర్యం ఉండటం విశేషం. అయితే ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆ 22 కార్లు ఇప్పుడిప్పుడే తెలంగాణకు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. పైగా ఆ 22 వాహనాలలో కేవలం నాలుగింటికి మాత్రమే బుల్లెట్ ప్రూఫ్, శాటిలైట్ కమ్యూనికేషన్, ఇతర సాంకేతిక వ్యవస్థ అనుసంధానం జరిగిందని తెలుస్తోంది.. ఇక వాటిలో మూడు కార్లు మాత్రమే సీఎంఓ కి డెలివరీ అయ్యాయి. ఒక కారు టెస్టింగ్ కోసం కేరళ తరలించారు. అయితే మిగతా 18 కార్లు మాత్రం వీర పనిని గూడెం లోని త్రీ హాయని ఇంజనీరింగ్ వర్క్స్ లోనే ఉన్నాయని తెలుస్తోంది.. ఇక ఆ 18 కార్లలో 9కార్లకు మాత్రమే ప్రస్తుతం బుల్లెట్ ప్రూఫ్, ఇతర సాంకేతిక పనులు జరుగుతున్నాయి. ఈ తొమ్మిది కార్లను మాత్రమే పూర్తిగా డోర్లతో సహా విడదీసి పక్కన పెట్టారు. బానెట్లను కూడా పూర్తిగా తొలగించారు. కార్ల స్ట్రక్చర్ మాత్రమే కొంతమేర కనిపిస్తున్నాయి. ఇక త్రీ హాయ్ అని ఇంజనీరింగ్ వర్క్స్ లో పనిచేస్తున్న నిపుణులు మొత్తం కేరళ రాష్ట్రానికి చెందిన వారే కావడం విశేషం.తెలంగాణ ముఖ్యమంత్రి ఆ 22 కార్ల గురించి వ్యాఖ్యలు చేసిన అనంతరం త్రిహాయని ఇంజనీరింగ్ వర్క్స్ లోకి జనం పోటెత్తుతున్నారు.. దీంతో అక్కడ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. గంగా ఆ కంపెనీ 25 సీసీ కెమెరాలతో నిరంతరంగా నిఘా కొనసాగిస్తోంది. అంతేకాదు తమ సిబ్బందిని సెల్ ఫోన్లు కూడా లోపలికి తీసుకు వెళ్ళనివ్వడం లేదు. ఇక గత ఏడాది 22 వాహనాలను అప్పటి తెలంగాణ ప్రభుత్వం ఈ కంపెనీకి బుల్లెట్ ప్రూఫ్ గా మార్చే పని అప్పగించింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఆ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తొలుత రోజు పది మంది నిపుణులు పనిచేసేవారు. తర్వాత కాలానికి ఆ సంఖ్య ఐదుగురికి తగ్గిపోయింది. రేవంత్ రెడ్డి ఇటీవల ఆ కార్ల గురించి ప్రస్తావించిన నేపథ్యంలో పనులు కొంతమేర ఊపు అందుకున్నాయి.. అయితే ఇప్పుడంతలో కార్లు డెలివరీ సూచనలు కన్పించడం లేదు.



# 31 లోగా కేవైసీ... మస్ట్



**హైదరాబాద్, జనవరి 1:** రేషన్ కార్డు ఉన్న లబ్దిదారులు జనవరి) 31లోగా ఈ–కేవైసీ పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం సూచించింది. రేషన్ కార్డు ఈ కేవైసీ పూర్తి చేయని వారు త్వరగా చేయాలని పౌరసరఫరాలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గత రెండు నెలలుగా రేషన్ సరఫరా షాపుల్లో డీలర్లు ఈ–కేవైసీ అప్ డేట్ చేస్తున్నారు. ఇందుకోసం ఆధార్ ధ్రువీకరణ, వేలిముద్రలు గుర్తింపును సేకరిస్తున్నారు. ఎవరైనా ఆధార్ లింక్ చేయకపోతే వెంటనే పూర్తి చేయాలని, కేవైసీ పూర్తి చేయకపోతే రేషన్ బియ్యం ఇవ్వరని ప్రభుత్వం స్పష్టం చేసింది. రేషన్ కార్డుదారులు జనవరి 31 లోగా... రేషన్ కార్డు, ఆధార్ నంబర్ కు లింక్ చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహాన్ తెలిపారు. రేషన్ కార్డుతో ఆధార్ కార్డు సీడింగ్ చేయకపోతే రేషన్ కార్డును నకిలీగా భావించి డిలీట్ చేయనున్నారు. రేషన్ కార్డు డిలీట్ అయితే ప్రభుత్వ డేటాలో రేషన్ కార్డు వివరాలన్నీ వెళ్లిపోతాయి. తర్వాత రేషన్ షాపులకు వెళ్లినా ఎలాంటి ఉపయోగం ఉండదు. రేషన్ కార్డును ఆధార్ నంబర్‌తో లింక్ చేయడానికి...రేషన్ కార్డులో ఉన్న సభ్యులందరి ఆధార్ నంబర్ సమర్పించాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా ఈ–కేవైసీని పూర్తి చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 30 నాటికి ఈ ప్రక్రియ 70.80 శాతం ఈ–కేవైసీ పూర్తయినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 87.81 శాతంతో మొదటి స్థానంలో ఉంది. 54.17 శాతంతో వనపర్తి జిల్లా చివరి స్థానంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన అనే పథకం ద్వారా...దేశవ్యాప్తంగా ఉచితంగా రేషన్ పంపిణీ చేస్తోంది. లక్షల్లో బోగస్ రేషన్ కార్డులు ఉన్నట్లు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం...ఆధార్ నంబర్‌తో లింక్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. రేషన్ కార్డు ఈ–కేవైసీ గడువును పలుసార్లు పొడిగించిన ప్రభుత్వం...తాజాగా జనవరి 31ని డెడ్ లైన్ గా విధించింది. అప్పటిలోపు రేషన్ కార్డును ఆధార్ కార్డుతో లింక్ చేయని వారికి బియ్యం కట్ చేయనున్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

**తిరుమల:**తిరుమల శ్రీవారిని, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై, కేంద్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి దర్శించి మొక్కులు తీర్చుకున్నారు...ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై, కేంద్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి వేర్వేరుగా దర్శించి మొక్కులు తీసుకున్నారు.. వీరికి ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా,అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి, శేష వస్త్రం తో సత్కరించారు.. నూతన సంవత్సర క్యాలెండర్లతోపాటు, టేబుల్ బుక్ జ్ఞాపికలను అందజేశారు... ఆలయ వెలుపల , తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళసై ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు..ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అనేక రాజకీయ ఆర్థిక, సామాజిక నేపథ్యంలో, భారతదేశం ఈ సంవత్సరం కీలకపాత్ర పోషించనుందని, కేంద్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు... ఈ సంవత్సరము మరింతగా శక్తినిచ్చే విధంగా అందరూ మనదేశ అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు . హిందువులందరూ ఆకాంక్షిస్తున్న అయోధ్యలోని రామ జన్మభూమి స్థానంలో



రామ మందిరం నిర్మాణం పూర్తయి ఈ జనవరిలో 22వ తేదీ ప్రాణ ప్రతిష్ట జరగనుందని, ఆరోజు ప్రతి హిందూ ఇంట్లో కూడా 22వ తేదీ సాయంకాలము ఐదు రామ జ్యోతులు వెలిగించి భక్తిని చాటాలని కోరారు...తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ , రాష్ట్ర ముఖ్యమంత్రిలకు,ప్రజలకు సినీ నటులు సుమన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారి దర్శనానంతరం ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ, తాను ఈ స్థాయిలో ఉండడానికి సినీ నిర్మాతలు, దర్శకులతోపాటు తనను ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు.. తెలంగాణ రాష్ట్రంలో గౌడ కులాన్ని, ఎస్సీ జాబితాలో చేర్చి, న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు..

# జనవరిలో దావోస్ కు రేవంత్

**హైదరాబాద్, జనవరి 1:** రేవంత్ తొలి విదేశీ పర్యటన ఖరారైంది. జనవరిలో స్విట్జర్లాండ్ వేదికగా జరిగినే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సమ్మిట్ లో పాల్గొనున్నారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు కూడా వెళ్లనున్నారుస్విట్జర్లాండ్ వేదికగా జనవరి లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సమ్మిట్ జరగనుంది.జనవరి 15 – 19 వరకు......5 రోజుల పాటు ఈ సమ్మిట్ జరగనుంది.ఈ సమ్మిట్ కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు కానున్నారు. సీఎంతో పాటు ఐటి శాఖ మంత్రి దుద్దుల శ్రీధర్ బాబు, ప్రత్యేక చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్ సీఎం వెంట స్విట్జర్లాండ్ వెళ్లనున్నారుఈ సమావేశాలకు షెడ్యూల్ ప్రకారం అయితే.....సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని టీం జనవరి 15న ఉదయం బయల్దేరి....18వ తేదీన సాయంత్రం హైదరాబాద్ చేరుకుంటారు.ఇక గత ఏడాది జరిగిన సమ్మిట్ కు అప్పటి మంత్రి కేటీఆర్ మరియు బృందం వెళ్ళారు.దాదాపు రూ.21 వేల కోట్ల పెట్టుబడులను



తెలంగాణ రాష్ట్రానికి తెచ్చామని అప్పటి మంత్రి కేటీఆర్ పలు మార్లు వెల్లడించారు.విదేశీ కంపెనీలు తెలంగాణలో పారిశ్రామిక యూనిట్లను స్థాపించి ఇన్వెస్ట్మెంట్ లు పెట్టేలా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ లో చర్చలు జరపనుంది.ఐటి,ఫార్మా,బయో,ఏరోసిస్,మ్యానుఫ్యాచరింగ్,సర్వీస్ రంగాల్లో అనుసరిస్తున్న విధానాలు,విదేశీ పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యత తదితర అంశాలను వివరించి రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి దోహదపడడం తో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.ఇక దావోస్ సమ్మిట్ థీమ్,అజెండా అంశాలను ఐటి మంత్రి శ్రీధర్ బాబు లోతుగా అధ్యయనం చేస్తున్నారు. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఇవ్వనున్న రాయితీలు, కల్పించనున్న సౌకర్యాలు ఆయా కంపెనీల ప్రతినిధులకు సీఎం రేవంత్ బృందం వివరిస్తారు.

# శ్రీశైలం ఆలయానికి పెరిగిన భక్తుల రద్ది

**నంద్యాల:**శ్రీశైలం ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది భక్తులు ఏపి తెలంగాణ మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో శ్రీశైలం ఆలయానికి చేరుకున్నారు వేకువజామున నుంచే భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటున్నారు నూతన సంవత్సరం అందులోను శివునికి ప్రీతికరమైన రోజు సోమవారం కావడంతో భక్తులు భక్తి భావంతో స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు క్యూలైన్లలో భారులు తీరారు స్వామివారి దర్శనానికి సుమారు 5 గంటల సమయం పడుతుంది ఆలయ క్యూలైన్లన్ని భక్తులతో నిండిపోయాయి భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో స్వామివారి గర్భాలయ అభిషేకాలు స్వామివారి సామూహిక అభిషేకాలు స్వామివారి స్పర్శ దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు ఈఓ పెద్దిరాజు వెల్లడించారు భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో భక్తులందరికి స్వామివారి అలంకార దర్శనానికి దేవస్థానం అధికారుల అనుమతిస్తున్నారు నూతన సంవత్సరం మొదటిరోజు భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్నారు భక్తులకు స్వామివారి దర్శనానికి ఇబ్బందులు కలుగకుండా అన్నిఏర్పాట్లు చేశారు క్యూలైన్లలో భక్తులకు పాలు మంచినీరు స్వామివారి ప్రసాదం అందిస్తున్నారు



వార్తాతరంగాలు
మంగళవారం 02 జనవరి 2024

## కలకలం రేపుతున్న కోమటిరెడ్డి కామెంట్స్



**హైదరాబాద్, జనవరి 1:**గెలవాలంటే కలవాలనే టీకాంగ్రెస్ ఫార్ములా ఆసక్తిగా మారుతున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నేతల మధ్య ఉన్న విభేదాలు పక్కన పెట్టి సమిష్టిగా కృషి చేసిన హస్తం నేతలు విజయం అందుకోగలిగారు. ఇక ప్రభుత్వంలోకి వచ్చాక సైతం అదే ఐక్యమత్యంతో ముందుకు సాగుతూ అందరిని ఆశ్చర్యపరుస్తున్నారు. కాంగ్రెస్ అంటేనే కలహాలు అనే మాట నుంచి.. కాంగ్రెస్ అంటే కమిట్ మెంట్ అనేలా పార్టీ నేతలకు అధిష్టానం దిశానిర్దేశం చేస్తోంది. ఈ క్రమంలో తాజాగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేస్తున్న వరుస ట్వీట్లు ఆసక్తిని రేపుతున్నాయి.నిన్న తాను, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిసి ఉన్న ఫోటోను షేర్ చేస్తూ.. కలిసి కొత్త శకాన్ని నిర్మిద్దాం అంటూ క్యాప్షన్ రాసుకొచ్చిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. ఇవాళ తాను, సీఎం రేవంత్ రెడ్డితో సలార్ మూవీ పాటతో రూపొందించిన వీడియోను ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా 'వేగమొకడు.. త్యాగమొకడు గతము మరువని గమనమే. ఒకరినొకరు నమ్మి నడిచిన బంధమే ఇదిలే. ఒకరు గర్జన.. ఒకరు ఉప్పెన వెరసి ప్రళయాలే. సైగ ఒకరు.. సైన్యం ఒకరు కలిసి కదిలితే కదనమే..' అంటూ రాసుకొచ్చారు.కోమటిరెడ్డి ట్వీట్లు టీకాంగ్రెస్‌తో పాటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఇంట్రెస్టింగ్‌గా మారుతున్నాయి. ఎన్నికలకు ముందు వరకు రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డికి మధ్య ఎడమొహం పెడమొహం అన్నట్లుగా వ్యవహారం సాగింది. కానీ ఆ తర్వాత వీరితో పాటు పార్టీ నేతలంతా కలిసికట్టుగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా మంత్రిగా కోమటిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అయితే రాబోయే పార్లమెంట్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి.అధికార పార్టీ హోదాలో అత్యధిక స్థానాలు గెలవడం హస్తం పార్టీ ముందున్న అతిపెద్ద టాస్క్. ఈ అచీవ్ మెంట్ సాధించాలంటే పార్టీ నేతలంతా సమిష్టిగా పని చేస్తే ఫలితాలలో మరింత మెరుగు పడవచ్చనే చర్చ జరుగుతున్న వేళ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తామంతా ఒక్కటే అంటూ ఐక్యతారాగం ఆలపించడం ఇంట్రెస్టింగ్‌గా మారింది.

## విజయోత్సవంతో ఇస్రో శుభారంభం



**శ్రీహరికోట, జనవరి 1:**భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్తలప్రతిభ మరోసారి ప్రపంచానికి చాటి చెప్పే రోజు . కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టిన తొలి రోజే ఇస్రో అద్భుతాన్ని చేసింది. భారత్ అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రపంచదేశంలోని అమెరికా తర్వాత మరో దేశం చేయని సాహసాన్ని చేసింది. బ్లాక్‌హోల్ పరిశోధ కోసం ఎక్స్‌పోశాట్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఎక్స్‌పోశాట్ శాటిలైట్‌ను ఉదయం 9.10నిమిషాలకు శ్రీహరి కోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించారు. ప్రయోగం మొదటి నుంచి అనుకున్న లక్ష్యం దిశగా పీఎస్ఎల్‌వీ సీ 58 దూసుకెళ్లింది. ఈ వాహకంతో ఎక్స్‌పోశాట్‌తోపటు మరో పది ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. ఆదివారం ఉదయం 8 గంటల పది నిమిషాలకు కౌంట్‌డౌన్ స్టార్ట్ చేశారు. ఈ ఉదయం 9 గంటల పది నిమిషాలకు ప్రయోగించారరు. అంతకు ముందు ఇస్రో శాస్త్రవేత్తలు తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రయోగ రాకెట్ నమూనకు ప్రత్యేక పూజలు చేశారు. ఇది భారత్ తొలి పొలారిమెట్రీ మిషన్... ప్రపంచంలో రెండోది. అమెరికా తర్వాత ఈ ప్రయోగం చేసిన రెండో దేశంగా కొత్త చరిత్ర సృష్టించింది. పల్సర్‌లు, బ్లాక్‌హోల్ ఎక్స్‌రే బైనరీలు, యాక్టివ్ గెలాక్సీ న్యూక్లియోలు, న్యూట్రాన్ స్టార్స్‌పై ఎక్స్‌పోశాట్ స్టడీ చేయనుందీ ఉపగ్రహం.ఈ ఉపగ్రహాన్ని భూకక్ష్యలో 500-700 కిలోమీటర్ల దూరంలో ప్రవేశ పెట్టారు. ఇందులో రెండు పేలోడ్స్ ఉన్నాయి. అవి ఐదేళ్ల పాటు సర్వీస్ అందిస్తాయి. ఒకటి పాలిఎక్స్, రెండోది ఎక్స్-రే స్పెక్ట్రోసోపీ టైమింగ్. మొదటిదికి ఎక్స్ కిరణాలను పొలారిమీటర్. దీన్ని రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తయారు చేసింది. రెండో పరికరాన్ని స్పేస్ ఆస్ట్రానమీ గ్రూప్ రూపొందించింది.

## భారీగా తగ్గనున్న పెట్రోల్ ధరలు



**హైదరాబాద్, జనవరా 1:**ఈ కొత్త సంవత్సరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలందరికీ సూపర్ గిఫ్ట్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. అవును.. అందరూ ఎప్పుడూ కోరుకునే.. అందరికీ అత్యవసరం అయ్యే అదిరిపోయే వార్తా న్యూ యర్ సందర్భంగా ప్రధాని ఇవ్వబోతున్నారట. వచ్చే ఏడాది ప్రారంభంలో ద్రవ్యోల్బణం నుంచి సామాన్యులకు పెద్ద ఉపశమనం లభిస్తుంది. నూతన సంవత్సరానికి ముందు ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా దేశప్రజలకు భారీ కానుకను అందించనున్నారు. అవును, విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం, పెట్రోల్ డీజిల్ ధరలలోభారీ తగ్గింపు ఉండబోతోంది. 2024 ప్రథమార్థంలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ తగ్గింపు అందుబాటులోకి రాబోతోనందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అందుతున్న వార్తలను పరిగణనలోకి తీసుకుంటే, పెట్రోల్ డీజిల్ రేట్లు 6 నుంచి 10 రూపాయల వరకు తగ్గే అవకాశం ఉంది.దీనికి సంబంధించి చమురు కంపెనీలతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది.మీడియా కథనాల ప్రకారం, ఇప్పుడు పెట్రోలియం మంత్రిత్వ శాఖ %--% ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించడానికి చర్చలు జరుగుతున్నాయి. దీంతోపాటు చమురు కంపెనీలతోనూ చర్చలు జరుపుతున్నారు. అంతా సవ్యంగా సాగితే పెట్రోల్, డీజిల్ ధరలు 6 నుంచి 10 రూపాయల వరకు తగ్గుతాయి.గత ఏడాది మే 22 నుంచి పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. పెట్రోలు, డీజిల్ ధరలు చాలా కాలంగా స్థిరంగా ఉన్నాయి. గత సారి కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించింది. ఈ కాలంలో పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.13, రూ.16 తగ్గింది. నిజానికి దిగుమతి చేసుకున్న ముడి చమురు కొనుగోలు ధరలో ఇటీవల కొన్ని నెలలుగా భారీగా తగ్గుదల చోటుచేసుకుందని పెట్రోలు మంత్రిత్వ శాఖ వాదిస్తోంది. ఈ ముడి చమురును పెట్రోల్ %--% డీజిల్ తయారు చేయడానికి రిఫైనరీకి పంపిస్తారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్-మార్చి) ఇప్పటివరకు ముడి చమురు ధరలు బ్యారెల్‌కు సగటున %వి%77.14గా ఉన్నాయి. కేవలం రెండు నెలల్లో అంటే, సెప్టెంబర్‌లో %వి93.54 --% అక్టోబర్‌లో %వి%90.08 మాత్రమే పెరిగింది. గత ఏడాది అంటే . 2022-23లో ముడి చమురు సగటు ధర బ్యారెల్‌కు %వి% 93.15గా ఉంది. అంటే గతేడాదికి.. ఈ ఏడాదికి ముడిచమురు ధర బ్యారెల్ కి సగటున దాదాపు %వి%16 డాలర్లు తగ్గింది. అందుకే, పెట్రోల్ ధరలు తగ్గే అవకాశం కలిగింది. నిజానికి చాలా నెలలుగా పెట్రోల్ ధరలు తగ్గుతాయని ప్రచారం జరుగుతోంది. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జనవరిలో పెట్రోల్ ధరలు తగ్గించాలని నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

# ఖమ్మంలో జీవో అడ్డం పెట్టుకొని... దోచేశారు...!




**ఖమ్మం, జనవరి 1:**జలు ఓట్లు వేసి గెలిపించిన ప్రజా ప్రతినిధులే కబ్జాకోరులుగా అవతారమెత్తారు. తమ సమస్యలు తీరుస్తారని ఆదరించిన ప్రజల కళ్ళుగప్పి ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములను కబ్జా చేయడమే పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వ క్రమబద్ధీకరణ జీవో 58, 59 జీవోను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను చెర పట్టేందుకు బరితెగించిన తీరు విస్మయం కలిగిస్తోంది.ఖమ్మంలో తాజాగా ఓ కార్పొరేటర్ అక్రమాల బాగోతం బయటికొచ్చింది. ప్రభుత్వ అభ్యంతరంలేని ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించడానికి జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులనే అస్త్రంగా మలచుకున్న సదరు కార్పొరేటర్ ఎంచక్కా కోట్ల విలువైన భూమిని కొట్టేద్దామని పన్నాగం పన్నారు. ప్రయత్నం పకడ్బందీగానే చేసినప్పటికీ ప్రభుత్వం మారిన ఫలితంగా ఆ గులాబీ కార్పొరేటర్ బండారం బయట పడింది.ఖమ్మం నగర కార్పొరేటర్ పగడాల శ్రీ విద్య ఖమ్మంలోని ఎన్ఎస్‌పి క్యాంప్ లో రామాలయానికి ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 92 లోని (ఇంటి. నెం. 11-11-20/6 లో) 415 చదరపు గజాల స్థలం క్రమబద్ధీకరించడం కోసం మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. కాగా క్షేత్ర స్థాయి విచారణలో భాగంగా విచారణ అధికారి ఆ స్థలాన్ని సందర్శించి ఎంక్వయిరీ పూర్తి చేశారు. విచారణ సమయంలో దరఖాస్తుదారు 2013లో జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డు, 2012 జారీ అయిన రేషన్ కార్డు, 2012లో పొందిన పాస్ పోర్టును ఆధారాలుగా చూపించారు. ఇవన్నీ ఆ ఇంటి చిరునామాలో అంటే 11-11-20/6లోనే జారీ చేసినట్లు ఉండటం విస్తుగొలిపే విషయం. ఈ స్థలంలో రెండు గదులు, ఒక హాలుతో పాటు టిన్ షెడ్ ను నిర్మించారు. కాగా ఆమె చూపించిన రుజువులు, విచారణ ఆధారంగా ప్రభుత్వ జీవో 59 కింద అభ్యంతరం లేని స్థలాన్ని క్రమబద్ధీకరించడానికి కోట్ల విలువ చేసే ఈ భూమిని అధికారులు సిఫారసు చేశారు. ఇందుకు అనుగుణంగా మార్కెట్ విలువను దరఖాస్తుదారు నుంచి వసూలు చేసి ఆ స్థలాన్ని ఎంచక్కా క్రమబద్ధీకరించేశారు.ఇదిలా ఉండగా ఎంతో విలువైన సదరు స్థలం ఖమ్మం నగర నివాసి, కార్పొరేటర్ అయిన పగడాల శ్రీ విద్య, భర్త నాగరాజుకు సంబంధించినది కాదని ఇటీవల అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై మున్సిపల్, రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిజాలు నిగ్గుతేలాయి. సదరు ఇంటి నెంబర్ 11-11-20/6 వాస్తవానికి సర్వే నెంబర్ 93లో ఉందని, సర్వే నెంబర్ 92లో కాదని అధికారులు నిగ్గు తేల్చారు. ఆ ఇంటి నెంబర్ తో ఉన్న ఇంటిని పదేళ్ల క్రితమే కూల్చి వేశారన్న విషయం స్పష్టమైంది. విచిత్రం ఏమిటంటే రామాలయానికి ఆనుకుని ఉన్న షెడ్‌కు, ఆ ఇంటి నెంబర్ 11-11-20/6 ను పెయింట్ వేశారు. వాస్తవానికి వారు అందులో నివాసం ఉండరని, ఆ ఇంటిని వేరే వారికి అద్దెకు ఇచ్చారని తెలిపిన విషయంలో విచారణ అధికారిని తప్పుదోవ పట్టించారని తేటతెల్లమైంది. వేరే ఆస్తిని చూపి సదరు ఇంటి నంబర్‌తో ఆమె పేర రిజిస్టర్ చేయించుకుని అక్రమముగా క్రమబద్ధీకరణ చేయించుకున్నారని ఎట్టకేలకు అధికారులు తేల్చారు. దీంతో ఆ నిర్మాణంలో తన అద్దెదారులని చెబుతూ కొంతమంది నకిలీ వ్యక్తులను అక్కడ నివాసం ఉంచడం గమనార్హం. ఈ విషయాలన్నీ తాజా విచారణలో తేలడంతో కార్పొరేటర్ శ్రీవిద్య బండారం బట్టబయలైంది. అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్ ఆ స్థలంలో ఉన్న నిర్మాణాలను కూల్చివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో 59 జీవో కింద చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసిన అధికారులు సాక్షాత్తు రామాలయం పక్కనే దేవుని సాక్షిగా అక్రమంగా నిర్మించిన టిన్‌షెడ్‌ను కూల్చివేశారు. కోట్ల విలువ చేసే 415 గజాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని రక్షణ చర్యలు చేపట్టారు.నిన్న మొన్నటి వరకు కొలువై ఉన్న గులాబీ పార్టీ నేతలు అధికారం ముసుగులో బోలెడన్ని అక్రమాలు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఖమ్మం నగరంలోని కార్పొరేటర్లే నగరంలోని ఎంతో విలువైన భూములను చెర పట్టారని తెలుస్తోంది. 58, 59 జీవోను అస్త్రంగా మలచుకుని ఎన్నో అక్రమాలకు పాల్పడినట్లు స్పష్టమవుతోంది. కేవలం అధికార పార్టీ అండ చూసుకొని నగరంలో ప్రభుత్వ భూములతో పాటు వివాదంలో ఉన్న ప్రైవేటు భూములను సైతం లాక్కుని ఎంచక్కా వాటిలో పాగా వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ఓ ముగ్గురు కార్పొరేటర్లు అధికారం ముసుగులో భారీగా భూ కబ్జాలకు పాల్పడినట్లు తెలుస్తోంది.ఖమ్మం నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధి సైతం వారి ఆగడాలకు ఊతంగా నిలిచినట్లు ఆరోపణలున్నాయి. కొన్ని భూముల ఆక్రమణ విషయంలో ఆయనే స్వయంగా రంగంలోకి దిగినట్లు కూడా చర్చ జరుగుతోంది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడంతో ఖమ్మం నగరంలో ప్రజా ప్రతినిధుల ఆగడాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇటీవల ఒక సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సైతం ఇదే అంశంపై అధికారులకు హెచ్చరిక జారీ చేయడం గమనార్హం. చేసిన అక్రమాలన్నింటినీ అధికారులే చక్కదిద్దాలని, లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన గట్టిగానే చురక వేశారు. ఖమ్మంలో గెలుపొందిన ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం గత ఐదేళ్లలో ఖమ్మంలో జరిగిన భూకబ్జాలు, అక్రమాలను చక్కదిద్దుతానన్న ఎజెండాతోనే ఎన్నికల ప్రచారంలోకి దిగారు. ఈ క్రమంలోనే ఆయన ఖమ్మం నియోజకవర్గ చరిత్రలో మునుపెన్నడూ నమోదుకాని 50 వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందడం బీఆర్ఎస్ నేతల ఆగడాలకు ప్రతీకారమే అన్నట్లు కనిపిస్తోంది.

## సంక్రాంతి నాటికి నామినేటెడ్ పోస్టులు



**హైదరాబాద్, జనవరి 1:**త్వరలోనే నామినేటెడ్ పదవులను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధమవుతోంది. ఇప్పటికే ఆ దిశగా కసరత్తు జరుగుతుండగా సంక్రాతి లోపే ఈ ప్రక్రియ పట్టాలెక్కే అవకాశం ఉందని తెలుస్తోంది.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ జోష్ తో ముందుకెళ్తోంది. పార్టీ అధికారంలోకి రావటంతో చాలా మంది నేతలు, కార్యకర్తలు నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెంచుకుంటున్నారు. ఇప్పటేక్ వాళ్లు ముఖ్య నేతల వద్ద ప్రతిపాదనలు కూడా పెట్టుకున్నట్లు తెలిసింది. దీనిపై ఇప్పటికే దృష్టిపెట్టిన రాష్ట్ర నాయకత్వం ఢిల్లీ పెద్దలతో కూడా ప్రాథమికంగా చర్చలు జరిపింది. అయితే సంక్రాంతి లోపే ఈ పదవులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల భర్తీ కోలాహలం మొదలైంది.పదేండ్లుగా అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ పార్టీ కోసం పనిచేసిన నేతలకు సంక్రాంతి కానుకగా నామినెటెడ్ పోస్టులు ఇవ్వాలని భావిస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రస్తుతం రాష్ట్రంలో 50కి పైగా కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటికి తోడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలతో పాటు పలు స్థానాలకు ఉప ఎన్నికలకు జరిగే అవకాశం ఉంది. ఇవే కాకుండా%శా%ఆరు మినిస్టర్ బెర్త్ లు కూడా భర్తీ చేయాల్సి ఉంది. వీటన్నింటి నేపథ్యంలో పార్టీలోని సీనియర్ నేతలు వీటిపై ఫోకస్ పెట్టారు. గెలిచిన వారితో పాటు ఓడిపోయిన నేతలు కూడా వారి స్థాయికి తగ్గట్టుగా ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.ప్రధానంగా ఎమ్మెల్సీ పదవుల కోసం సీనియర్ నేతలు ఎక్కువగా పోటీ పడుతున్నారు. ఈ లిస్టులో చూస్తే మధుయాష్కీగౌడ్, షబ్బీర్ అలీ, జగ్గారెడ్డి, ఫిరోజ్ ఖాన్, అద్దంకి దయాకర్, చిన్నారెడ్డి, మైనంపల్లి, ప్రతాప్ రెడ్డి, జంగా రాఘవ రెడ్డి, పటేల్ రమేశ్ రెడ్డితో పాటు చాలా మంది నేతలు ఉన్నారు. ఇక ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలుగా గెలిచిన మల్ రంగారెడ్డి, సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి వారు మంత్రి పదవులపై కన్నేశారు.ఇక పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ చాలా ఏళ్లుగా పార్టీ కోసమే పని చేస్తున్న నేతలు, కార్యకర్తలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్యారాచూట్ నేతలకు ప్రాధాన్యం ఇవ్వకుండా%శా%. పార్టీ కోసమే నిరంతరం పని చేసిన వారిని గుర్తించే అవకాశం ఉంది. అంతేకాకుండా%శా%. నామినేటెడ్ పదవుల్లో అమరవీరుల కుటుంబాలకు కూడా అవకాశం ఇవ్వొచ్చని తెలుస్తోంది. ఇదిలా ఉంటే%శా% గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులకు ప్రొఫెసర్ కొదండరామ్ తో పాటు ప్రముఖ కవి అందె శ్రీ పేర్లను కూడా కాంగ్రెస్ సర్కార్ పరిశీలిస్తున్నట్లు సమాచారం.కీలకమైన ఈ పదవులన్నీ ఈ సంక్రాంతి లోపే పూర్తి చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల మేరకు తెలుస్తోంది. లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ%శా% నేతలకు గుర్తింపునిస్తే మరింత ఉత్సాహంతో పని చేసే అవకాశం ఉంటుందని రాష్ట్ర నాయకత్వం భావిస్తోందంట..! మొత్తంగా చూస్తే నామినేటెడ్ పదవులు దక్కించుకునే నేతలెవరో త్వరలోనే తేలిపోనుంది!

## ములుగుకు రెండు పంటలకు సాగునీరుకు కృషి



**ములుగు:**పంచాయితీ రాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క ములుగు పంపు హౌస్ నుండి జంగాల పల్లి,బంజారు పల్లి గ్రామాల చెరువులకు సాగు నీరు వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తలపునే గోదావరి ఉన్న ఈ ప్రాంతానికి చుక్క నీరు ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు మన నీళ్లను తీసుకుపోయి గత ప్రభుత్వం ఈ ప్రాంతానికి అన్యాయం చేసింది అనిరామప్ప రిజర్వాయర్ చేసి పక్క నియోజక వర్గాలకు సాగు నీరు తీసుకుపోయి మనకు మాత్రం చుక్క నీరు ఇవ్వకుండా మన రైతాంగానికి గత ప్రభుత్వం అన్యాయం చేసింది ఈ ప్రాంత రైతులకు త్వరలోనే రెండు పంటలకు సాగునీరు అందించే విధంగా నేను కృషి చేస్తానని త్వరలోనే ముఖ్య మంత్రి ని కలిసి పంపు హౌస్ నుండి మిగితా మండలాలకు కూడా సాగు నీరు ఇచ్చే విధంగా చూస్తానని మంత్రి సీతక్క గారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు తో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా, బ్లాక్,మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## వైసీపీ ఆఫీసుపై దాడి...



**గుంటూరు, జనవరి 1:**వైఎస్ఆర్సీపీ పార్టీ కార్యాలయంపై దాడులను ఖండించారు విడదల రజనీ. ఇలాంటి చర్యలకు పాల్పడటంపై తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. న్యూ ఇయర్ వేడులను సాధారణంగా జరుపుకోకుండా పధకం ప్రకారమే దాడి చేశారని అరోపించారు. డీసీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దుండగులను పట్టుకునే ప్రయత్నం చేస్తోందని వివరించారు మంత్రి రజినీ. ఈ రోడ్డుపై ఇలాంటి రాళ్లు ఎక్కడా లేవన్నారు. వీటిని ఎక్కడి నుంచో తీసుకొని వచ్చి తాము కొత్తగా నిర్మించిన పార్టీ ఆఫీసుపై విసిరారన్నారువైఎస్ఆర్సీపీ పార్టీ కార్యాలయంపై దాడులను ఖండించారు విడదల రజనీ. ఇలాంటి చర్యలకు పాల్పడటంపై తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. న్యూ ఇయర్ వేడులను సాధారణంగా జరుపుకోకుండా పధకం ప్రకారమే దాడి చేశారని అరోపించారు. డీసీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దుండగులను పట్టుకునే ప్రయత్నం చేస్తోందని వివరించారు మంత్రి రజినీ. ఈ రోడ్డుపై ఇలాంటి రాళ్లు ఎక్కడా లేవన్నారు. వీటిని ఎక్కడి నుంచో తీసుకొని వచ్చి తాము కొత్తగా నిర్మించిన పార్టీ ఆఫీసుపై విసిరారన్నారు. కొత్త ఆఫీసు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లేకపోతే పూర్తి స్థాయిలో అద్దాలు ధ్వంసం అయ్యేవని వివరించారు. చంద్రబాబుకు బీసీ సామాజిక వర్గం పట్ల ఎప్పుడూ చిత్తశుద్ధి లేదని విమర్శించారు.వందల మంది పార్టీ ఆఫీసు ముందు గుమిగూడి రాళ్లు రువ్వినట్లు తెలిపారు. ఈ దాడివెనుక ఎవరున్నారన్నది విచారణలో తేలుతుందన్నారు. వారిని ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టమని హెచ్చరించారు. బీసీ మహిళగా కొత్తగా నిర్మించుకున్న పార్టీ ఆఫీసును న్యూఇయర్ సందర్భంగా ప్రారంభించుకోవాలని అనుకుంటే.. దానికి అడ్డుతగిలే ప్రయత్నం చేశారన్నారు. టీడీపీకి ఓటమి భయం పట్టుకున్నందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు అర్థమవుతోందన్నారు. అధికార దాహం కోసం గూంఢాలను పురమాయించి ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడే వారిని గుంటూరు ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు

# మున్సిపాల్టీల్లో సమరం...




**కరీంనగర్, జనవరి 1:**జమ్మికుంట, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీల్లో సొంత పార్టీ నేతలే తిరుగుబాటు జెండా ఎగురవేశారు. రాష్ట్రంలో అధికారం మారడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారు. పలు మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పలు చోట్ల రాజకీయ సమీకరణాలు మారిపోతున్నాయి. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీలో ముసలం పుట్టింది. మొత్తం 30 మంది కౌన్సిలర్లలో చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావుపై అవిశ్వాసం పెట్టేందుకు 21 మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారు. అధికారులకు అవిశ్వాసం నోటీసు ఇచ్చిన తరువాత ఓ హోటల్ దగ్గర చైర్మన్, కౌన్సిలర్ల మధ్య గొడవ జరిగింది.మరోవైపు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రేసులో పొనగంటి మల్లయ్య ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మహబూబ్ నగర్‌లోనూ సేమ్ సీన్ కనిపిస్తోంది. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో అసమ్మతి కలకలం రేపుతోంది. సొంత పార్టీ నేతలే తిరుగుబాటు జెండా ఎగురవేసేందుకు సిద్ధమయ్యారు. మొత్తం 49 వార్డులు ఉండగా.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే 41 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాస తీర్మానానికి దాదాపు 15 మంది కౌన్సిలర్లు సిద్ధమైనట్లు తెలిసింది. వీరంతా రహస్య సమావేశాలను సైతం నిర్వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతు కూడగట్టే అంశంపై సమాలోచనలు చేస్తున్నారు. అవిశ్వాస తీర్మానాలపై కాంగ్రెస్ పార్టీ అచితూచి అడుగులు వేస్తోంది. బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు మాత్రం అవిశ్వాస ప్రక్రియ ద్వారా అధికార కాంగ్రెస్‌కు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

# ఎక్స్ పోశాట్ విజయవంతంగా ప్రయోగం: ఇస్రో




**బెంగళూర్ జనవరి 1:**2024 సంవత్సరం తొలిరోజునే భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఎక్స్పోశాట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. ఇదే ఉత్సాహంతో ఈ ఏడాది మరికొన్ని మిషన్లను చేపట్టనున్నది. ఇందులో కీలకమైన గగన్‌యాన్ మిషన్ సైతం ఉన్నది. గగన్‌యాన్‌తో పాటు ఈ ఏడాది 12 నుంచి మిషన్లను చేపట్టాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుందని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు. 2024 గగన్‌యాన్ మిషన్‌కు సన్నాహక సంవత్సరమని తెలిపారు. గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఇస్రో 2023లో అబార్ట్ మిషన్ నిర్వహించింది. ఈ ఏడాది మరో రెండు అబార్ట్ మిషన్లను నిర్వహించనున్నట్లు సోమనాథ్ ప్రకటించారు. రెండు మానవరహిత మిషన్లు.. హెలికాప్టర్ డ్రాప్ టెస్ట్, లాంచ్ ప్యాడ్ అబార్ట్ టెస్ట్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు పలు వాల్యుయేషన్ పరీక్షలు సైతం నిర్వహించనున్నట్లు తెలిపారు.

**ఈ ఏడాది నింగిలోకి జీఎస్ఎల్వీ..**

ఈ ఏడాది జీఎస్ఎల్వీని సైతం ప్రయోగించనున్నట్లు ఇస్రో చైర్మన్ తెలిపారు. ఇన్‌శాట్-3డీఎస్, భారత యుఎస్ సంయుక్తంగా నిర్మించిన నిసార్, సెకండ్ జనరేషన్ నావిగేషన్ ఉపగ్రహాలను జీఎస్ఎల్వీ నింగిలోకి మోసుకెళ్లనుందని చెప్పారు. రెండు వాణిజ్య ఉపగ్రహాలను, పీఎస్ఎల్వీ రాకెట్‌తో పలు రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలు, ఓ ఎస్ఎస్ఎల్వీ ప్రయోగం సైతం ఉంటాయని వివరించారు. స్క్రామ్ జెట్ ఇంజిన్ పరీక్ష, రీయూజబుల్ లాంచ్ వెహికల్ టెస్ట్‌లను సైతం 2024లో నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది కనీసం 12 మిషన్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. హార్డ్‌వేర్ లభ్యతను బట్టి ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్పోశాట్‌పై సైతం సోమనాథ్ స్పందించారు. ఇది ఓ ప్రత్యేక మిషన్ అని పేర్కొన్నారు. దీంతో కృష్ణ బిలాలపై మరింత అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. ఒక గతేడాది ప్రయోగించి ఆదిత్య ఎల్-1 జనవరి 6న ఎల్-1 పాయింట్‌కు చేరుకుంటుందని వివరించారు.

# శ్రీ కళ్యాణ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పల్లకి సేవ



**జోగులాంబ గద్వాల 1 జనవరి (స్మై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణ సమీపంలోని నది అగ్రహారం గ్రామంలో వెలసిన శ్రీ కళ్యాణ లక్ష్మి వెంకటేశ్వర స్వామి పల్లకి సేవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కళ్యాణ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని పల్లకిని అందంగా అలంకరించి పల్లకిపై ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి నది అగ్రహారం వీధుల మీదుగా పల్లకి సేవలు నిర్వహించారు. గద్వాల పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల్లోని గ్రామాల భక్తులు ఈ పల్లకి సేవ ఉత్సవం లో పాల్గొని కనులార తిలకించారు. గోవింద నామస్మరణతో పల్లకి సేవ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ పూజారి ప్రసన్న చారి ఆధ్వర్యంలో ఈ పల్లకి సేవ ఉత్సవాన్ని నిర్వహించారు.

## శ్రీ జోగులాంబ దేవాలయం సందర్శించుకున్న సినీ నటుడు బాలకృష్ణ సతీమణి



**జోగులాంబ గద్వాల 1 జనవరి (స్మై న్యూస్):** ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర ఆదివారం అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు దేవాలయ ఈవో పురంధర్, అర్చకులు స్వాగతం పలికారు. నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. ముందుగా వినాయకుని పూజ , బాల బ్రహ్మేశ్వర స్వామి అభిషేకం అనంతరం అమ్మవారి దేవాలయంలో కుంకుమార్చనలు నిర్వహించి చండీ హెూమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేవాలయ చరిత్రను వారికి వివరించారు. అనంతరం అమ్మవారి, స్వామివారి శేష వస్త్రం తో సన్మానించారు.

# అడ్డాకుల మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**తోట శ్రీహరి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు**

**అడ్డాకుల, జనవరి 1, (స్మై న్యూస్):** అడ్డాకుల మండల పరిధిలో అన్ని గ్రామాల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు 2024 వెల్కం తెలుపుతున్నానని అడ్డాకుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తోట శ్రీహరి మాట్లాడుతూ, ఎన్నో కష్టాలు మరెన్నో ఆనందాలు గుర్తుడిపోయే జ్ఞాపకాలు గుర్తించుకునే బాధలు, అన్ని కలగలిపి ఆనందాన్ని మిగిల్చి ఆప్యాయతను మించి, అనుకున్న ఆశయాలని అధిరోహిస్తు, బాధలను తొలగించి, బాధ్యతలు పెట్టి, పాత అలవాట్లకు బరువైన గుండెతో, గుడ్ బై చెబుతూ, ప్రతి సంవత్సరం క్యాలెండరు మార్చుతున్నాం గాని, మన అలవాట్లు, పక్కవారితో మాట్లాడే విధానం, చెడు అలవాట్లు(ఈర్ష్య, కోపం) ఇలాంటి పద్ధతులు మార్చుకోని కొత్త ఆశయాలకు, కొత్త ఆలోచనతో వడి వడి గా అడుగులు వేస్తూ, నిత్యం చిరునవ్వుతో.. అందరి ఆప్యాయత తో పలుకరిస్తూ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా



కోరుకుంటూ,,అడ్డాకుల మండల పరిధిలో లోని అన్ని గ్రామాల ప్రజలకు పేరు పేరు న నూతన సంవత్సరానికి 2024 స్వాగతం పలుకుతూ.... మీకు, మీ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఎల్లప్పుడూ మీ మంచి కోరే... మీ తోట శ్రీహరి అడ్డాకుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు.

# 5న జిల్లా ఆసుపత్రిలో ఉచిత కంటి చికిత్స శిబిరం

**నాగర్ కర్నూల్ జనవరి 1( స్మై న్యూస్):**జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ వారి ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా ఆస్పత్రిలో ఈనెల 5న శుక్రవారం నాడు ఉదయం 9 గంటలకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి తెలిపారు.శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత క్యాట్రాక్ట్ కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. సాధారణ పరీక్షలు బీపీ,షుగర్,



కరోనా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకుని రిపోర్టుతో శిబిరానికి రావాలని కోరారు. పరీక్షల అనంతరం అర్హులైన వారిని ఏనుగొండ లోని లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రి మహబూబ్ నగర్ కు ప్రత్యేక అంబులెన్స్ లో పంపి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు.రోగులు తమ వెంట ఆధార్ కార్డు,రేషన్ కార్డ్ జీరాక్స్ కాఫీలు తెచ్చుకోవాలని తెలిపారు.మరిన్ని వివరాలకు 9440454284 నంబర్ లో సంప్రదించాలని తెలిపారు.

## మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి వెండి సమర్పణ



**జోగులాంబ గద్వాల 1 జనవరి (స్మై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా. మల్దకల్ మండల కేంద్రంలో వెలసిన శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారికి అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ పట్టణానికి చెందిన దాతలు ఎం ఆర్. శేష పాణి శర్మ, సుమలత దంపతులు స్వామి వారికి 130 గ్రాములవెండి సమర్పణకోసం 10,116 రూపాయలను ఆలయ చైర్మన్ పట్వారి ప్రహల్లాద రావు కు వారు అందజేశారు. ఈ దంపతులకు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి ,స్వామివారి ఆలయ చరిత్ర పుస్తకం, ఆశీర్వాదాన్ని అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలను ఇచ్చారు. చివరగా ఆలయ అధికారి దాతలకు రసీదును అందజేశారు.

## ధరూర్ మండలం పెద్దపాడు లో నూతన సంవత్సర వేడుకలు

**జడ్పీచైర్ పర్సన్ కాంగ్రెస్ పార్టీ గద్వాల ఇంచార్జీ సరితమ్మ**



**జోగులాంబ గద్వాల 1 జనవరి (స్మై న్యూస్):** గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల పరిధిలోని పెద్దపాడు గ్రామంలోని ఎం.బి బేతన చర్చి నందు నూతన సంవత్సర 2024 వేడుకలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ హాజరై కేక్ కట్టింగ్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు...ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిపి నజ్మానిస బేగం,గోనుపాడు శ్రీనివాస్ గౌడ్,గ్రామ నాయకులు తోట రాముడు, తెలుగు హన్మంతు, తెలుగు రాముడు, గోపాల్, శివ,నరసింహులు,వెంకటన్న, చిన్నపాడు సర్పంచ్ ఆంజనేయులు, హన్మంతు,జమ్మిచేడు రాము,గార్లపాడు మల్లేష్, గంజి రాములు,కృష్ణ తదితరులు ఉన్నారు.

# నూతన సంవత్సర బిసి సేన క్యాలెండర్ ఆవిష్కరించిన జడ్పీ చైర్ పర్సన్ సరితమ్మ

**జోగులాంబ గద్వాల 1 జనవరి (స్మై న్యూస్):** గద్వాల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని బిసి సేన 2024 సంవత్సర క్యాలెండర్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు.అనంతరం సరితమ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తరపున ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల కృష్ణ యాదవ్, మధుసూదన్ బాబు, టిపిసిసి రాష్ట్ర నాయకుడు గంజిపేట్ శంకర్,ఓబిసి అధ్యక్షుడు నల్లారెడ్డి,రామలింగేశ్వర కాంళ్లే, గంజిపేట్ తిమన్న,పాతపాలెం శ్రీనివాస్ గౌడ్,గట్టు



సత్యనారాయణ,శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్,జమ్మిచేడు రాము,గోవింద్ గౌడ్, లక్ష్మి నారాయణ గౌడ్, కృష్ణయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి వెండి సమర్పణ



**జోగులాంబ గద్వాల 1 జనవరి (స్మై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా. మల్దకల్ మండల కేంద్రంలో వెలసిన శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారికి అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ పట్టణానికి చెందిన దాతలు ఎం ఆర్. శేష పాణి శర్మ, సుమలత దంపతులు స్వామి వారికి 130 గ్రాములవెండి సమర్పణకోసం 10,116 రూపాయలను ఆలయ చైర్మన్ పట్వారి ప్రహల్లాద రావు కు వారు అందజేశారు. ఈ దంపతులకు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి ,స్వామివారి ఆలయ చరిత్ర పుస్తకం, ఆశీర్వాదాన్ని అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలను ఇచ్చారు. చివరగా ఆలయ అధికారి దాతలకు రసీదును అందజేశారు.

# నూతన సంవత్సర వేడుకలో పాల్గొన్న జెడ్పీ చైర్పర్సన్ సరిత

**జోగులాంబ గద్వాల, జనవరి 1 (స్మైన్యూస్) :** గద్వాల నియోజకవర్గంలోని ధరూర్ మండలం, పెద్దపాడు గ్రామంలోని ఎం.బి బేతన చర్చి నందు సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర 2024 వేడుకలకు జిల్లా పరిషత్ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత హాజరై చిన్నారులతో కలిసి కేక్ కట్టింగ్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవి, ఎంపిపి నజ్మానిసా బేగం, గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, గ్రామ నాయకులు తోట రాముడు, తెలుగు హన్మంతు, తెలుగు రాముడు, గోపాల్, శివ, నరసింహులు, వెంకటన్న, చిన్నపాడు సర్పంచు ఆంజనేయులు,



హన్మంతు, జమ్మిచేడు రాము, గార్లపాడు మల్లేష్, గంజి రాములు, కృష్ణ తదితరులు ఉన్నారు.

## సంతోష్ కుమార్ మృతి తీరనిలోటు




**నాగర్ కర్నూల్ జనవరి 1( స్మై న్యూస్)** బీజేవైఎం నాయకులుగా పనిచేస్తున్న కావూరు సంతోష్ కుమార్ మృతి బీజేవైఎం కు తీరని లోటుని పలువురు నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు సోమవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకవైపు బ్రాహ్మణ పరిషత్ ను ఏకం చేయడంతో పాటు గోరక్ష కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని అలాంటి సంతోష్ కుమార్ అనారోగ్యం పాడిన పడి మృతి చెందడం ఆయన కుటుంబానికి మరియు సమాజానికి తీరని లోటని అన్నారు ఈ కార్యక్రమంలో ఎలిమే చిక్కంద్ర చందు శ్రీనివాసులు సుదీర్ గౌడ్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు

**జోగులాంబ గద్వాల, జనవరి 1(స్మైన్యూస్) :** గద్వాల జిల్లాలో దక్షిణ కాశిగా.. అయిదవశక్తి పీఠంగా విరాజిల్లుతున్న అలంపూర్ బాల బ్రహ్మేశ్వర స్వామి, జోగులాంబ అమ్మవారిని సోమవారం భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే. అరుణ దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం డీకే. అరుణ స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలు, రైతులు, అన్ని వర్గాల వారు సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలు కలిగి



ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రామచందర్ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు బండల పద్మావతి, జిల్లా అధికార ప్రతినిధి ఈశ్వర్, జిల్లా కార్యదర్శి నాగేశ్వర్ రెడ్డి, నాగ మల్లయ్య, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, బిజెపి సీనియర్ నాయకులు రఘు గౌడ్, కృష్ణం రాజు, పట్టణ అధ్యక్షులు మద్దిలేటి, రంగస్వామి, నరేష్, వినీత్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీచైర్ పర్సన్ సరితమ్మకు కాంగ్రెస్ నాయకుల నూతన సంవత్సర శుభాకాంక్షలు.....



**జోగులాంబ గద్వాల 1 జనవరి (స్మై న్యూస్):** గద్వాల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా నూతన సంవత్సరం 2024 వేడుకలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ్ల రాజశేఖరరెడ్డి, ఖలీం,భాస్కర్ యాదవ్, నాగేంద్ర యాదవ్, బిజ్వారం శ్రీనివాస్ రెడ్డి,ఇసాక్,శ్రీనివాసు గౌడ్, సత్యరెడ్డి,పెదొడ్డి రామకృష్ణ, శ్రీనాథ్ రెడ్డి, చింతలకుంట గోవర్ధన, మాజీ ఎంపిటీసి శ్రీనాథ్, పూడూర్ ఈశ్వర్, సిక్కిల మల్దకల్ తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు



# గ్రామపంచాయతీ సిబ్బంది ఔదార్యం



**ఐదు నిమిషాల్లో స్పందించిన జిపి సిబ్బంది**

**పెద్దమందడి, జనవరి 1, (స్కై న్యూస్)** పెద్దమందడి మండలం, వెలటూరు గ్రామం, న్యూ ఎస్సీ కాలనీలో, కానపురం రాములు ఇంటి పక్కల కుక్క చనిపోవడం జరిగింది. ఇట్టి విషయాన్ని గ్రామపంచాయతీ సిబ్బంది రుక్మద్దీను గార్కి సమాచారం ఇవ్వగా, కేవలం ఐదు నిమిషాల లోపల చనిపోయిన కుక్కని తరలించడం జరిగింది. నూతన సంవత్సర శుభాకాంక్షలు రోజు గ్రామ పంచాయతీ సిబ్బంది, కేవలం ఐదు నిమిషాల లోపల స్పందించినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయాన్ని సందర్శించుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి



మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని జోగులాంబ గద్వాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.కుష దంపతులు సోమవారం సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గుబ్బ ప్రభాకర్ సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి దేవాలయ వ్యవస్థాపక వంశీయులు శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం వారికి స్వామి వారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానం చేశారు.

# బైరి నరేష్ కు అయ్యప్ప భక్తుల వార్నింగ్

**వరంగల్, జనవరి 1:**ములుగు జిల్లా ఏటూరునాగారంలో భీమాకోరేగామ్ స్ఫూర్తి సందర్భంగా విజయ్ దివాస్ కార్యక్రమమం ఏర్పాటు చేశారు. ఏటూరునాగారం వై జంక్షన్ సమీపంలోని ఫంక్షన్ హాల్ లో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బైరి నరేష్ హాజరయ్యారు. అయ్యప్ప, శివ స్వాములు ఫంక్షన్ హాల్ కు చేరుకొని.. బైరి నరేష్ పై విరుచుకుపడ్డారు. అయ్యప్ప స్వామిని దూషించిన బైరి నరేష్ ఇక్కడ నుంచి పోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బైరి నరేష్ స్వాములకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తాను గతంలో అయ్యప్ప భక్తులపై చేసిన వ్యాఖ్యలకు వెనక్కి తీసుకున్నానని గతంలో చెప్పడంతో పాటు జైలుకు వెళ్లడం జరిగిందని బైరి నరేష్ వివరించారు. జైలుకు వెళ్లడంతో పాటు అనేక కేసులు నమోదయ్యాయని నరేష్ స్వాములకు చెప్పారు. అయినా స్వాములు వినకుండా బైరి నరేష్ ను అక్కడి నుంచి పంపించారు.ఈ క్రమంలో బైరి నరేష్ వెళ్తున్న క్రమంలో నర్సింగరావు అనే అయ్యప్ప భక్తుడిని కాలుపై నుండి వెళ్లడంతో కు కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడి నుంచి బైరి నరేష్ తప్పించుకుని వెళ్తుండగా నరేశ్ కారు కూడా ప్రమాదానికి గురైంది. దీంతో దానిని అక్కడే వదిలేసి నరేష్ అడవుల్లోకి పరారైనట్లు సమాచారం. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కన్నూరు గ్రామానికి చెందిన బైరి నరేశ్ గతంలో అయ్యప్ప స్వామి పట్ల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీంతో అప్పట్లోనే ఆయనపై అయ్యప్ప భక్తులు, హిందుసంఘాల ప్రతినిధులు దాడి చేశారు.

# సీనియర్ సీటీజన్స్ సమాజ మార్గదర్శకులు

**కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష**



**జగిత్యాల:**సీనియర్ సీటీజన్స్ సమాజ మార్గదర్శకులని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సీటీజన్స్,పెన్షనర్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖల ప్రతినిధులు అసంఘాల రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష ను కలిసి 2024 నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ సీటీజన్స్,పెన్షనర్స్ అస్సోసియేషన్ ల 2024 క్యాలెండర్ లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్దులకు సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు అందిస్తున్న సేవలను అభినందించారు. .అనంతరం హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్,వయో వృద్ధుల అప్పిలేట్ చైర్మన్ షేక్ యాస్మిన్ భాష ఆధ్వర్యంలో జగిత్యాల ,కోరుట్ల,మెట్ పల్లి ట్రిబ్యునల్ చైర్మన్ లు నర్సింహ మూర్తి,సోమ రాజేశ్వర్,దూలం మధులు సీనియర్ సిటీజేన్స్ కేసుల పరిష్కారం లో రాష్ట్రములో నెంబర్ వన్ గా నిలిచినందుకు అభినందనలు తమ అస్సోసియేషన్ తరపున తెలిపారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ సీనియర్ సీటీజన్స్,పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, ట్రెసా జిల్లా అధ్యక్షుడు ఎం.డి.వకీల్,టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్, పెన్షనర్స్ జిల్లా కార్యదర్శి బొల్లం విజయ్,సీనియర్ సీటీజన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,ఉపాధ్యక్షులు పి.సి.హన్మంత్ రెడ్డి,ఎండి.యాకూబ్, నాయకులు ప్రకాష్ రావు, ,పి.ఆశోక్ రావు,దేవేందర్ రావు, ఎం.డి.ఎక్బాల్,, కరుణ,తదితరులు పాల్గొన్నారు.

# బిర్యాని బాలేదన్నందుకు దాడి

**హైదరాబాద్, జనవరి 1:**బిర్యానీ బాలేదన్నందుకు, అందులో ముక్కలు తక్కువగా వచ్చాయన్నందుకు అబిడ్స్ గ్రాండ్ హోటల్ లో కస్టమర్లపై వెయిటర్లు దాడి చేశారు. కర్రలు, కుర్చీలతో వెయిటర్లు, హోటల్ సిబ్బంది దాడి చేయగా.. 12 మంది యువతీ యువకులకు గాయాలయ్యాయి. న్యూ ఇయర్ సెలబ్రేషన్ లో భాగంగా బిర్యానీ తినేందుకు వెళితే వారిపై హోటల్ సిబ్బంది దాడి చేయడం నగరంలో సంచలనంగా మారింది. ఈ ఘటనపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర స్థాయిలో స్పందించారు. దూల్ పేటకు చెందిన వారిపై దాడి చేశారని.. గ్రాండ్ హోటల్ సిబ్బంది, యాజమాన్యంపై చర్యలు తీసుకోలేదని రాజా సింగ్ అబిడ్స్ పోలీసులను డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోకపోతే హోటల్ కు నిప్పు పెడతామని సైతం రాజా సింగ్ హెచ్చరించినట్లు సమాచారం.దూల్ పేటకు చెందిన కొందరు యువతీ యువకులు న్యూ ఇయర్ సెలబ్రేషన్ లో భాగంగా బయట డిన్నర్ చేద్దామనుకున్నారు. అబిడ్స్ %ఛూ% వెనుక ఉన్న గ్రాండ్ హోటల్ కు యువతీ యువకులు వెళ్లారు. అక్కడ మటన్ బిర్యానీ, కొందరికి చికెన్ బిర్యానీ ఆర్డర్ చేశారు. అయితే బిర్యానీలో ముక్కలు తక్కువ రావడంతో కస్టమర్లు హోటల్ సిబ్బందిని ప్రశ్నించారు. అందులోనూ బిర్యానీ సరిగా లేదని, ఎందుకు ఇలా సర్వ్ చేస్తున్నారని కాస్త గట్టిగానే అడినట్లు తెలుస్తోంది. బిల్లు మాత్రం పూర్తిగా తీసుకుని కస్టమర్లను మోసం చేస్తున్నారంటూ దూల్ పేటకు చెందిన యువతీ యువకులు గ్రాండ్ హోటల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిర్యానీ అంత బాగాలేదని, మటన్ ముక్కలు తక్కువగా వచ్చాయని, బిల్లు మొత్తం కట్టేది లేదని చెప్పడంతో హోటల్ వెయిటర్లు వారితో గొడవకు దిగారు. ఈ క్రమంలో కస్టమర్లు, హోటల్ సిబ్బంది పరస్పరం దాడులు చేసుకున్నారు. హోటల్ సిబ్బంది అయితే కర్రలు తీసుకొచ్చి మరీ కస్టమర్లను విచక్షణారహితంగా చితకబాదారు. కుర్చీలతో సైతం కస్టమర్లపై దాడి చేయగా పలువురు కస్టమర్లు గాయపడ్డారు. తీవ్రగాయాలైన వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. తమ ఏరియాకు చెందిన వారిపై హోటల్ సిబ్బంది అకారణంగా దాడి చేసి గాయపరిచిందని ఎమ్మెల్యే రాజా సింగ్ మండిపడ్డారు. బాధ్యులైన హోటల్ సిబ్బందిపై, యాజమాన్యంపై కేసు నమోదు చేసుకుని చర్యలు తీసుకోవాలని అబిడ్స్ పోలీసులను డిమాండ్ చేశారు. పోలీసులు చర్యలు తీసుకోకపోతే హోటల్ పై దాడి చేసి నిప్పు పెడతామని హెచ్చరించినట్లు తెలుస్తోంది.సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కస్టమర్లపై దాడికి పాల్పడిన అబిడ్స్ గ్రాండ్ హోటల్ కు చెందిన కొందరు వెయిటర్లను సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి పీఎస్ కు తరలించారు. కస్టమర్లపై దాడి ఘటనకుగానూ పోలీసులు గ్రాండ్ హోటల్ పై 324, 504, 509 కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న మరికొందరు నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని, కేసు దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. మరోవైపు హోటల్ యాజమాన్యం సైతం కస్టమర్లపై ఫిర్యాదు చేసింది. తమ సిబ్బందితో దురుసుగా మాట్లాడి, వారిపై దాడి చేయడం వల్లే గొడవ జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు

# షర్మిళకు ఏపీనే కరెక్ట్

**హైదరాబాద్, జనవరి 1:**వైఎస్ షర్మిల ఏపీ రాజకీయాల్లోకి వస్తారని ప్రచారం జరుగుతున్న వేళ తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత వి. హన్మంతరావు కీలక వ్యాఖ్యలు చేశారు. వైఎస్ షర్మిల ఏపీ రాజకీయాల్లో బాగా రాణిస్తారని అన్నారు. ఇప్పటికే పార్టీలోకి షర్మిల వచ్చారని, ఆంధ్రా కాంగ్రెస్ నేతలకు గుడ్ న్యూస్ అని వీహెచ్ అన్నారు. షర్మిల గతంలో ఎక్కడ నష్టపోయారో అక్కడే సాధించుకోవాలని అన్నారు. హైదరాబాద్ లోని గాంధీ భవన్‌లో వీ హన్మంతరావు మీడియాతో మాట్లాడారు. షర్మిలని ఏపీ కాంగ్రెస్ నేతలు ఆహ్వానిస్తున్నారని వీహెచ్ అన్నారు. సోనియా గాంధీ 6 గ్యారంటీ స్కీమ్స్ ప్రకటనతో ప్రజలు తెలంగాణలో తమ పార్టీకి పట్టం కట్టారన్నారు. రాజీవ్ గాంధీ ఇంటర్ నేషనల్ 20-20 టోర్నమెంట్ ఫైనల్‌కి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రావాలని ఆహ్వానించినట్లు వి.హనుమంతరావు తెలిపారు.షర్మిల ఏపీ రాజకీయాల్లోకి వెళ్తేనే ఆ ప్రజల్లో ఆలోచనా విధానం మారుతుందని అన్నారు. ఆంధ్రలో కూడా కాంగ్రెస్ పార్టీ బలపడాలని వీహెచ్ ఆకాంక్షించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రజలు అన్నదమ్ములుగా కలిసి ఉందామని చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అన్యాయాన్ని జిల్లాలో సమావేశాలు పెట్టి కేసీఆర్ పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతని రేవంత్ రెడ్డి బయటకు తెచ్చారని అన్నారు. ప్రజలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సోనియా గాంధీకి అప్పగించాలని ప్రజలకు వీహెచ్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడానికి అందరం కష్టపడాలని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి అందరికీ న్యాయం చేస్తారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి నెల రోజులు కూడా కాకుండానే బీఆర్ఎస్ నేతలు హడావుడి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే హరీశ్ రావు మరీ తొందర పడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 3 ఎకరాలు, ఇంటికో ఉద్యోగం అని హామీ ఇచ్చి.. మొత్తం మర్చిపోయిందని అన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారన్నారని.. ధరణి పేరు మీద పేదల భూములను కేసీఆర్ ప్రభుత్వం లాక్కుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అన్నింటిని నెరవేరుస్తామని వి. హనుమంతరావు మరోసారి చెప్పారు.సోనియాగాంధీ ఇచ్చిన హామీలు అమలు చేసి తీరుతామన్నారు. ఆరు గ్యారంటీలు అమలుకు సీఎం కృషి చేస్తున్నారని తెలిపారు. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ అండర్ 18 క్రికెట్ మ్యాచ్ ఫైనల్ కి రావాలని కోరామని అన్నారు.



# జిల్లా ప్రజలకు 2024-నూతన సంవత్సర శుభాకాంక్షలు: అదనపు ఎస్పీ నాగేంద్రుడు.

**నారాయణపేట జనవరి 1( స్కై న్యూస్)** నిత్యం సవాళ్లతో కూడుకున్న పోలీసు వృత్తికి ఏరోజుకారోజు కొత్తదనం ఉంటుందని, ప్రజల రక్షణ, శాంతిభద్రత పరిరక్షించడానికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని అదనపు ఎస్పీ నాగేంద్రుడు అన్నారు. 2024 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కేక్ కోసి సిబ్బందికి మరియు ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భాంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఒక ఏడాది కాలంలో మన జయాపజయాలను బేరీజు వేసుకుని మరింత ఉత్సాహంగా పని చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకుందామని అన్నారు. నిన్నటికన్నా మెరుగైన ఫలితాలు రాబట్టుకునేందుకు, వృత్తి నైపుణ్యాలకు మెరుగు పెట్టుకోవడం, ఆచరణలో పెట్టడానికి ఇటువంటి సందర్భాలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు పోలీసు శాఖ పట్ల స్నేహపూర్వకంగా ఉండడం ఎంతో సంతోషకరమని, ఈ బంధాన్ని పటిష్టపరచడంలో మనం నిరంతరం కృషి చేద్దామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో గతేడాది సాధించిన ఉత్తమ ఫలితాలకు సిబ్బంది చేసిన కృషి అద్వితీయమని, లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు వెళదామని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు. పోలీసు సిబ్బంది, కుటుంబాలు, జిల్లా ప్రజలు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే జిల్లా ప్రజలతో పాటు ప్రజాప్రతినిదులకు, పాత్రికేయులకు పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేసే అన్నీ శాఖల అధికారులకు, సిబ్బందికి 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ శేఖర్ బాబు, ఆర్ఎస్ఐ లు శివ శంకర్, లలిత, అర్మడు రిజర్వు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.







# ఫిబ్రవరి 17న షర్మిల కొడుకు పెళ్లి

**హైదరాబాద్, జనవరి 1:**వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కుమారుడి పెళ్లి గురించి అధికారిక ప్రకటన చేశారు. తన కొడుకు వైఎస్ రాజా రెడ్డి – ప్రియా అట్లూరి వివాహం త్వరలో జరగబోతుందని వెల్లడించారు. జనవరి నెల 18న నిశ్చితార్థం, ఫిబ్రవరి 17న వివాహ వేడుక నిశ్చయించినట్లుగా వెల్లడించారు. ఈ మేరకు వైఎస్ షర్మిల ఎక్స్ లో ఓ పోస్టు చేశారు "అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ 2024 నూతన సంవత్సరంలో నా కుమారుడు వైఎస్ రాజా రెడ్డికి, ప్రియమైన అట్లూరి ప్రియాతో జనవరి నెల 18న నిశ్చితార్థం వేడుక, ఫిబ్రవరి 17న 2024 వివాహ వేడుక జరగనున్న సంగతి మీతో పంచుకోవడం ఆనందంగా ఉంది. రేపు మేం కుటుంబ సమేతంగా కాబోయే వధూవరులతో కలిసి ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్‌ని సందర్శించి తొలి ఆహ్వాన పత్రిక ఘాట్ వద్ద ఉంచి, నాన్న ఆశీస్సులు తీసుకోవడం జరుగుతుంది అని చెప్పడానికి సంతోషంగా ఉంది" అని వైఎస్ షర్మిల ట్వీట్ చేశారు.



## కొత్త సంవత్సరం వేళ.. జపాన్ ను వణికిస్తున్న భారీ భూకంపం

**సునామీ హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ సంస్థ**

**ఉత్తర కొరియా రష్యాల కు కూడా సునామీ హెచ్చరికలు జారీ**

**టోక్యో జనవరి 1:**కొత్త సంవత్సరం వేళ.. జపాన్ ను భారీ భూకంపం వణికించింది. ఇషికావా రాష్ట్రంలో సోమవారం 7.6 తీవ్రతతో భూ ప్రకంపనలు సంభవించాయి. దీంతో జపాన్ వాతావరణ సంస్థ సునామీ హెచ్చరికలు జారీ చేసింది. తీర రాష్ట్రాలైన ఇషికావా, నీగటి, తొయామా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.ఇషికావాలో సుమారు 5 మీటర్ల ఎత్తు వరకు సునామీ అలలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు వెదర్ ఏజెన్సీ తన వార్నింగ్‌లో తెలిపింది. హొక్కియాడా నుంచి నాగసాకి మధ్య జపాన్ సముద్రతీరం వెంట సుమారు మూడు మీటర్ల ఎత్తులో సునామీ అలలు వచ్చే అకాశాలు ఉన్నాయి. భారీ భూకంపం నేపథ్యంలో ఉత్తర కొరియా రష్యాల కు కూడా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆ రెండు దేశాలకూ పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ హెచ్చరికలు జారీ చేసింది.

# అందరికీ అండగా నిలుస్తా

**ఎస్టీ సంఘం రాష్ట్ర నాయకులు సింగం సుబ్బారావు**

**తాడేపల్లిగూడెం:**గూడెంపేద వర్గాలకు అండగా నిలుస్తామని, మంచి చెడులలో ముందుండి సహాయపడతానని ఎస్టీ సంఘం రాష్ట్ర నాయకులు సింగం సుబ్బారావు అన్నారు. సోమవారం మెట్ట ఉప్పరగూడెం లో నూతన సంవత్సర వేడుకలను ఎస్టీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుబ్బారావు చేతులపై కేక్ ని కట్ చేసి అందరూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం ఆరు గ్రామాలకు చెందిన పేద వర్గాలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింగం సుబ్బారావు మాట్లాడుతూ పేద వర్గాలకు సహాయపడటంలో నిజమైన ఆనందం ఉంటుందన్నారు. ప్రతి ఏటా నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పేద వర్గాలకు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ నూతన సంవత్సరంలో అన్ని వర్గాలు ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. తాడేపల్లిగూడెం నియోజవర్గంలోని అన్ని గ్రామాలలో 16 ఎస్ టి సంఘాలు ఉన్నాయన్నారు. ప్రతి ఏటా తనకున్న దానిలో కొంత పేద వర్గాల కోసం ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. పేద వర్గాలకు సహాయపడటంలో నిజమై ఆనందాన్ని చూస్తున్నామని అన్నారు. నియోజవర్గంలోని సుమారు నాలుగువేల మందికి ప్రతి ఏ ట వస్త్ర దాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.



ఈ కార్యక్రమంలో ఎస్టి సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు, తనుకు ఏఎంసీ డైరెక్టర్ బండి పార్వతి, వివిధ గ్రామాల ఏకలవ్య సంఘం అధ్యక్షులు చిన్న మర్రి దుర్గయ్య, చిన్న మర్రి శ్రీనివాస్, కల్లి ముత్యాలు, ఎం హరిబాబు, పండు,వెరుగొండ శ్రీను తదితరులు ఉన్నారు

# కాంగ్రెస్ లోకి వైసీపీ అలక ఎమ్మెల్యేలు



**కర్నూలు, జనవరి 1:**ఏపీ రాజకీయాలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఫోకస్ పెట్టారా? వైసీపీ అలక ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్పించేలా కసరత్తు చేస్తున్నారా? అందుకోసం రేవంత్ దూత ఒకరు అలక ఎమ్మెల్యేలకు టచ్‌లో ఉన్నారా? కాంగ్రెస్‌లో చేరితే హైదరాబాద్‌లో మీ ఆస్తులు పదిలం.. మీరు కాంగ్రెస్‌లో చేరితే మీ వ్యాపారాలకు సహకరిస్తామంటూ నేతలను వలలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారా? ఈ ప్లాన్ సక్సెస్ అయితే వైసీపీ ఓట్లు చీలి టీడీపీకి లాభం చేకూరనుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో తన మార్కును చూపించుకునేందుకు, కనీసం 40 మంది అలక ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్పించి తన సత్తా ఏంటో నిరూపించుకునేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నాలు చేస్తుండడం వైసీపీ నేతలను ఇరకాటంలో పడేసింది. అలక నేతలు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు ముందే రాజకీయ వేడి మొదలైంది. రాష్ట్ర విభజన నాటి నుంచి ఏపీలో కాంగ్రెస్ పార్టీ నామ రూపాల్లేకుండా పోగా.. తెలంగాణలో మాత్రం సీఎం రేవంత్ రెడ్డి రూపంలో పుంజుకుంది. అదే ఒరవడిని ఏపీలో తీసుకొచ్చి రెండు తెలుగు రాష్ట్రాల్లో తన మార్కును చూపించుకునేందుకు తెలంగాణ సీఎం కసరత్తు చేస్తున్నారు. ఏపీలో సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో రోజుకో కథనం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా ఏపీ సీఎం జగన్ అభ్యర్థులను మార్చే పనిలో ఉండగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఏపీలో దాదాపు 40 మందిని కాంగ్రెస్ పార్టీలో చేర్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.అందు కోసం ఆయన తన దూతను అలక ఎమ్మెల్యేలపై ఫోకస్ చేయాలని ఆదేశాలివ్వడంతో ఆ దూత అదే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. తను అనుకున్నది అనుకున్నట్లు జరగాలని, జరుగుతుందని నమ్మే కొద్ది మందిలో జగన్ ఒకరు. ఆయన 70 మంది అభ్యర్థులను మార్చడమో తీసేయడమో చేస్తున్నారు. అయితే జగన్ కొత్తవారిని పెట్టి గెలిపిద్దామనుకుంటే రేవంత్‌రెడ్డి జగన్‌కు భారీ షాకిచ్చారు. ఏపీలో ఏ పార్టీ ఎమ్మెల్యేకైనా తెలంగాణలో ఆస్తులు, వ్యాపారాలు ఉంటాయన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జగన్ మార్చిన ఎమ్మెల్యేలతో రేవంత్ దూత ఒకరు వివరాలు సేకరిస్తున్నారు.వారిని హైదరాబాద్‌లో మీ వ్యాపారాలకు సహకరిస్తాం.. కాంగ్రెస్‌లో చేరండి.. ఎలాగో 2024లో మోడీకి సీట్లు తగ్గుతాయి.. 2029లో కచ్చితంగా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది.. మీరు కాంగ్రెస్‌లో చేరితో మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పి వారిని తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తుండడం వైసీపీని ఇరకాటంలో పడేసింది. చాలా మంది వైసీపీ అలక ఎమ్మెల్యేలు రేవంత్ దూతకు సమ్మతం తెలుపుతున్నట్లు సమాచారం. వాస్తవానికి జగన్ వదిలేసిన ఎమ్మెల్యేలకు ఇది బంపరాఫర్ అనే చెప్పాలి. ఎందుకంటే దీర్ఘకాలంగా చూసుకుంటే రేవంత్ సరసన చేరడమే వారికి ఎక్కువ ఉపయోగం. కాబట్టి చాలామంది రేవంత్ దూతకు టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.తెలంగాణ సీఎం ప్లాన్ సక్సెస్ అయితే మాత్రం ఏపీ వైసీపీలో భారీ స్థాయిలో ఓట్లు చీలనున్నాయి. దాదాపు 40 మందిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవడంతో టీడీపీకి కలిసి రానుందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున పరోక్షంగా టీడీపీని గెలిపించే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. ఏపీ వైసీపీలో అలక ఎమ్మెల్యేలతో రేవంత్ దూత ఎలాగూ సీటు రానపుడు మీరు ఆ పార్టీలో ఉన్నా ఉపయోగం లేదని, ఈ ఐదేళ్లు మీ వ్యాపారాలు బాగుంటాయని, ఒక వేళ మీకు బలం ఉంటే ఈ ఎన్నికల్లో గెలుస్తారు.. కానీ పార్టీ మీద ఇపుడు జనంలో నెగెటివిటీ లేదు.కాబట్టి కాంగ్రెస్‌లో చేరండి అని రేవంత్ దూత బ్రెయిన్ వాష్ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వైఎస్ షర్మిలకు పార్టీ పగ్గాలు ఇవ్వనున్నారనే వార్తలు విన్పిస్తున్న నేపథ్యంలో ఆమెకూ ఈ ప్లాన్ కలిసి రానుందనే చర్చ సాగుతోంది.

# తెరపైకి సైకాలజికల్ వార్

దేశంలో వ్యూహకర్తలు లేనిదే ఎన్నికల్లో గెలవలేమనే వాతావరణాన్ని సృష్టించారు. నాయకుల బలహీనతలను ఆసరా చేసుకొని డబ్బు సంపాదనే లక్ష్యంగా వ్యూహకర్తలు అడుగులేస్తున్నారు. నాయకులు ప్రజలతో సత్సంబంధాలు కలిగుంటే ఏ వ్యూహకర్తలతో పనిలేదు. క్షేత్రస్థాయిలోని పార్టీ కార్యకర్తలతో పార్టీ అధినేతలు క్రమంగా సంబంధాలు కొనసాగిస్తే ప్రజలు ఏమనుకుంటున్నారో అనేది వ్యూహకర్తల కంటే పార్టీ కార్యకర్తలే ఎక్కువగా చెప్పగలుగుతారు. ఎన్నికల వ్యూహంలో పీకే స్ట్రయిక్ రేట్ చూసి ఆయన ఎటువైపు నిలబడితే అటే గెలుపనే భ్రమ పడేవాళ్ల సంఖ్య పెరిగింది. మరోవైపు పీకే ఏ పార్టీనీ గెలిపించరు, గెలిచే పార్టీనే ఎంచుకోవడమే అతని వ్యూహమనే ప్రచారముంది.రాజకీయపార్టీకి ప్రజలే ముఖ్యం. ప్రజల్లో లేని పార్టీని ఏ వ్యూహకర్తా పైకి లేపలేడు. అధికారంలోకి రావాలంటే కన్సెల్టెన్సీ వ్యూహాల కంటే ప్రజల విశ్వాసం, కార్యకర్తల బలమే ప్రధానం. లేకపోతే వ్యూహకర్తల పన్నాగాలలో చిక్కుకొని పార్టీలు భంగపాటుకు గురవడం ఖాయం.సైకలాజికల్ వార్‌లో నిజంగా వ్యూహకర్తల ప్రణాళికలు ఎంతవరకు పని చేస్తాయి వంటి ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించే క్రమంలో పీపుల్స్ పల్స్ చేసిన అధ్యయనంలో పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ కోసం సునీల్ కనుగోలు వ్యూహాలు రచించారని మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగినా ఆ పార్టీ గెలుపు తర్వాత పీసీసీ చీఫ్ మొదలుకొని ప్రధాన నేతలెవరూ ఆయన పేరే ఎత్తలేదు. తెలంగాణలో పెద్దఎత్తున బీఆర్‌ఎస్‌పై ప్రజావ్యతిరేకత ఏర్పడడంతో ప్రజలు వర్సస్ బీఆర్‌ఎస్‌గా ఎన్నికలు జరిగాయి. నిజంగా సునీల్ కనుగోలుతోనే తెలంగాణలో కాంగ్రెస్ గెలుస్తే మన దేశంలో 90వ దశకం నుంచి నాయకులు సర్వేలపై, వ్యూహకర్తలపై ఆధారపడటం పెరుగుతూ వచ్చింది. ఇదంతా ఒకప్పుడు తెరవెనక సాగే కథగా ఉండేది. ప్రశాంత్ కిషోర్ దానిని ఇప్పుడు తెర ముందుకు తీసుకొచ్చి, పొలిటికల్ కార్పోరేట్ బిజినెస్‌గా మార్చారు. ఎంబీఏ గ్రాడ్యుయేట్స్ ఒక వస్తువును అమ్మినట్లు, పీకే తన టీమ్‌తో 'హైప్'ని సృష్టిస్తూ రాజకీయ పార్టీలను, అభ్యర్థులను తన క్లయింట్స్‌గా చేసుకున్నారు. ఆయన మార్కెటింగ్ చతురతతో పాపులారిటీ సంపాదించుకున్నాడు. దీంతో ఇప్పుడు రాజకీయాల్లో ఆయన పేరు మారుమోగుతోంది.ఇక ఏపీ రాజకీయాలను పరిశీలిస్తే కేవలం రాజకీయల వ్యూహాల కోసమే అయితే, చంద్రబాబు పీకేని రహస్యంగా సంప్రదించి ఆయన సలహాలు, సూచనలు తీసుకునేవారు. ఇందుకు భిన్నంగా గన్నవరం




విమానాశ్రయంలో లోకేశ్‌తో కలిసి పీకే రావడం, దీన్ని మీడియాకు లీక్ చేయడం ద్వారా వైస్సార్సీపీ కార్యకర్తల్లో టీడీపీ అలజడి సృష్టిస్తూ సైకలాజికల్ వార్ మొదలుపెట్టింది. గత ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి పని చేసిన పీకే తమను గెలిపించడానికి వచ్చిన విభీషణుడని టీడీపీ శ్రేణులు భావిస్తుండగా పీకే టీడీపీని నాశనం చేయడానికి వెళ్లిన శకుని అని వైఎస్సార్సీపీ వర్గం అనుకుంటోంది. చంద్రబాబుతో పీకే సమావేశం తర్వాత ఐ ప్యాక్ సంస్థ ఎక్స్ ఖాతాలో స్పందిస్తూ ఏపీలో జగన్ నేతృత్వంలోని వైఎస్సార్సీపీకి తమ సేవలు కొనసాగుతాయని, 2024లో తమదే విజయమని ట్వీట్ చేసింది. దీంతో ఎవరు ఎటువైపో అర్థంకానీ గందరగోళ పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి. నిన్నటి వరకు వైఎస్సార్సీపీ వాళ్లకు మిత్రుడిగా ఉన్న పీకే ఇప్పుడు శత్రువు అయ్యారు. టీడీపీ-జనసేన వాళ్లకు నాటి శత్రువుతోనే ఈ రోజు స్నేహం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులుండరని చెప్పడానికి ఇదొక ఉదాహరణ.నిజాయితీ, నిబద్ధత అనేవి కార్యకర్తల స్థాయి మాటలు. ఇందుకు భిన్నంగా లాభం, లబ్ది వ్యాపార సూత్రాలను రాజకీయ వ్యూహకర్తలు అనుసరిస్తున్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి పని చేసిన పీకే ఇప్పుడు టీడీపీకి పని చేయడంలో తప్పు లేదు! ఇది చూసి వైఎస్సార్సీపీ అభిమానులు ఆందోళన చెందడంలో అర్థం లేదు! పాత క్లయింట్ వైఎస్సార్సీపీ మీద సానుకూలత లేకనో, 2019లో వైఎస్సార్సీపీని గెలిపించింది తానే అని క్రెడిట్ తీసుకోవడానికో, లేదా టీడీపీ నుంచి వ్యాపార లబ్ది కోసమో పీకే చంద్రబాబు గుమ్మం తొక్కారని వైఎస్సార్సీపీ కార్యకర్తలు వాస్తవాన్ని గుర్తించాలి.వాస్తవానికి టీడీపీ కోసం పీకే శిష్యులు రాబిన్ శర్మ, శంతన్ సింగ్ నాలుగేళ్ల నుంచి వ్యూహకర్తలుగా పని చేస్తున్నారు. 'బాదుడే బాదుడు', 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' వంటి కార్యక్రమాలు తప్ప పెద్దగా ప్రజాధారణ పొందిన కార్యక్రమాలేమీ వాళ్లు రూపొందించలేకపోయారు. యువగళం పాదయాత్రను కూడా కార్పోరేట్ ఈవెంట్ లాగా మార్చేశారనే విమర్శలు ఉన్నాయి. పైగా అది అనుకున్నంత లక్ష్యం కూడా చేరలేకపోయింది!క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాలుండే కింద స్థాయి నేతలు, కార్యకర్తలతో పార్టీ అధినేతలు నిత్యం సంబంధాలు కొనసాగిస్తే ప్రజల అవసరాలు, ఆకాంక్షలు తెలుస్తాయి. వాటిని అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలు పార్టీలకుంటాయి. చంద్రబాబు, జగన్, కేసీఆర్, రేవంత్‌తో సహా ఏ అధినేత అయినా పార్టీ కార్యకర్తలతో సమావేశాలు, వీడియో కాన్ఫిరెన్స్‌లు నిర్వహిస్తారు. అధినేతలు చెప్పిందే కార్యకర్తలు వినాల్సివస్తున్న పరిస్థితుల్లో ప్రజలకు ఏమి కావాలో పైవారికి తెలియక వ్యూహకర్తల వలలో చిక్కుకుంటున్నారు.ఎమర్జెన్సీ తర్వాత కాళ్లకి బలపం కట్టుకుని దేశమంతా తిరిగిన ఇందిరాగాంధీ 1980లో కాంగ్రెస్‌ని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చారు. ఇందుకు ఆమె ఏ వ్యూహకర్తలనూ నియమించుకోలేదు. 1983లో ఏపీలో ఎన్టీ రామారావు కూడా వ్యూహకర్తల సహాయం లేకుండానే ముఖ్యమంత్రి అయ్యారు. 2003లో ఎలాంటి కార్పోరేట్ కన్సెల్టెంట్ సంస్థల అండా లేకుండానే దివంగతనేత వైఎస్.రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేపట్టి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. 2014, 2018లో తెలంగాణలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం వెనక కూడా ప్రజలు తప్ప ఏ వ్యూహకర్తా లేరు. కేవలం వ్యూహకర్తలతోనే విజయం సాధ్యమవుతుంది అంటే వీరు యూపీలో, ఏపీలో కాంగ్రెస్‌ని గెలిపించగలరా తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టులను అధికారంలోకి తీసుకురాగలరా?కార్యకర్తలు లేని పార్టీలకు వ్యూహకర్తలు ప్రాణం పోయలేరు. కార్యకర్తలను మించిన వ్యూహకర్తలు లేరని పార్టీలు తెలుసుకోవాలి. గ్రామాల్లోని సర్పంచ్ లేదా కార్యకర్తలతో మాట్లాడితే పార్టీ పరిస్థితి అవగాహనలోకి వస్తుంది. దీనికోసం టెక్నోక్రాట్స్ అక్కర్లేదు. వందల కోట్లు పెట్టి వ్యూహకర్తలను కాదు పెట్టుకోవాల్సింది 100 ఓట్లను ప్రభావితం చేసే కార్యకర్తను పట్టించుకుంటే, ఆ పార్టీ తరతరాలు నిలబడుతుందని గుర్తించాలి. ఐ ప్యాక్ చెప్పినట్టు విని, వేర్ల లాంటి కార్యకర్తల్ని, దిగువస్థాయి నాయకులను విస్మరిస్తే ఎలాంటి ఫలితాలు ఎదురవుతాయో చెప్పడానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీకి ఎదురైన ఓటమే నిదర్శనం. విద్యార్థి రాజకీయాల్లో కూడా గెలవని వారి సలహాలతో నడుచుకుంటున్న నలభై ఏళ్ల టీడీపీకి కూడా ఇలాంటి పరిస్థితి ఎదురవ్వడానికి ఎక్కువ సమయం పట్టకపోవచ్చు.

# వైసీపీ జాబితా టెన్షన్..

**విజయవాడ, జనవరి 1:**వైఎసఆరసిపిలో అభ్యర్థుల కసరత్తు జరుగుతోంది. డిసెంబర్ 31లోపు 50 మంది ఇంచార్జుల మార్పుతో రెండో జాబితా వస్తుందని వారంతా.. ఒకటో తేదీ నుంచి పెన్షన్ కానుక పంపిణీతో ప్రజల్లోకి వెళ్లడం ప్రారంభిస్తారని నాలుగు రోజులుగా చెబుతున్నారు. కానీ ఆ జాబితా మాత్రం విడుదల కాలేదు సరి కదా.. మెల్లగా పాత అభ్యర్థులకే టిక్కెట్లు ఖరారు చేస్తున్నట్లుగా సమాచారం ఇస్తున్నారు. తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దన్న సంకేతాలు పంపుతున్నారు. దీంతో వైఎస్ఆర్‌సీపీలో మళ్లీ యూటర్న్ నిర్ణయాలు జరుగుతున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. అభ్యర్థుల మార్పుపై సీఎం జగన్ పునారాలోచిస్తున్నారని.. మారుతున్న రాజకీయంతో పాటే వ్యూహాలను కూడా మార్చుకోవాలనుకుంటున్నారని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి షర్మిల అధ్యక్షురాలు కావడం ఖాయమన్న ప్రచారం కొంత కాలంగా జరుగుతోంది. ఇటీవల ఏపీ కాంగ్రెస్ నేతలందర్నీ పిలిపించుకున్న హైకమాండ్ దాదాపుగా ఇదే సందేశాన్ని ఇచ్చింది. ఇక లాంఛనంగా షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ బాధ్యతలను తీసుకోవడమే మిగిలింది. అప్పుడే షర్మిల వల్ల ఎవరికి నష్టం అన్నదానపై చర్చలు ప్రారంభమయ్యాయి. ఎవరికి నష్టమో.. ఆ పార్టీ అగ్రనేతలకు బాగా తెలుసు. అందుకే షర్మిల వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. తాను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి కడప నుంచి పార్లమెంట్ కు పోటీ చేస్తానని సంకేతాలు పంపుతున్నారు. అదే సమయంలో క్రిస్మస్ పండుగకు టీడీపీ ముఖ్య నేతలకు ఎప్పుడూ లేని విధంగా గిఫ్టులు పంపారు. ఇవన్నీ రాజకీయంగా వ్యూహాత్మకంగా జరుగుతున్న పరిణామాలే. షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి వస్తే. దళిత, మైనార్టీల్లో ఓ పది శాతం మంది కాంగ్రెస్ వైపు మళ్లినా అది ఎవరికి డ్యామేజ్ జరుగుతుందనేదానిపై రాజకీయవర్గాలకు భిన్నాభిప్రాయాలు లేవు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థుల కొరత కూడా ఉండదు. టిక్కెట్ రాదని తెలిసి వైసీపీకి గుడ్ బై చెప్పేసిన మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే తాను షర్మిల వెంట నడుస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో షర్మిల చేరిక ఖాయమని ఆయన నిర్ధారణకు రావడంతోనే ఈ ప్రకటన చేశారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇక జగన్మోహన్ రెడ్డి టిక్కెట్లు నిరాకరిస్తున్న వారిలో ఎక్కువ మంది వైసీపీలో ఉండే అవకాశం లేదు. ఎందుకన్నట.. టిక్కెట్లు పొందే నేతలు తమను రాజకీయంగా నిర్వీర్యం చేయాలని అనుకుంటారు.



పార్టీని వీడటం తప్ప మరో మార్గం లేదు. వీరందరికీ టీడీపీ, జనసేనల్లో చాన్స్ దొరకదు. కానీ షర్మిల వల్ల కాంగ్రెస్ పార్టీలో చోటు దొరుకుంది. అంటే .. బలమైన అభ్యర్థుల కొరత కూడా తీరుతుంది. ఇలాంటి వారంతా వైసీపీ క్యాడర్ ను తీసుకుని కాంగ్రెస్ పార్టీకి వెళ్తారు. ఇంచార్జుల్ని మార్చే విషయంలో సీఎం జగన్ ముందు ఈ అతి పెద్ద సమస్య వచ్చి పడింది.వైసీపీ పై సీఎం జగన్‌కు పూర్తి స్థాయిలో పట్టు ఉందని ఎక్కువ మంది నమ్ముతారు. ఆయన చెప్పిందే వేదం అని భావిస్తారు. అదే నిజం కూడా. కానీ అధికారంలో ఉండే ఏ పార్టీ అధ్యక్షుడికైనా ఆ పవర్ ఉంటుంది. ఎన్నికలకు ముందు.. పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయన్న ప్రచారం ఉన్నప్పుడు తమ డిమాండ్లపై ఏ మాత్రం తేడా వచ్చినా.. ధిక్కారం వినిపిస్తారు. అలాంటివి ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీలో ఎక్కువగా వినిపిస్తున్నాయి. జగన్ తరపున వైఎస్ఆర్‌సీపీ వ్యవహారాలను చక్కబెట్టే టాప్ ఫోర్ నాయకుల్లో ఒకరు అయిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి సోదరుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి చేసిన తిరుగుబాటు దీనికి నిదర్శనం. ఉత్తరాంధ్ర నుంచి అవకాశం రాని నేతలంతా అదే బాటలో ఉండనున్నారు. చివరికి రాయలసీమ నుంచి కూడా ధిక్కారం వినిపించే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. పెనుమలూరు ఎమ్మెల్యే పార్థసారథి సీఎం జగన్ తనను నమ్మలేదంటూ చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. రాజకీయ పార్టీల్లో ఒక్క సారి అంటుకుంటే.. అది దావాలనం అవుతుంది.ఎదురుగా షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఉంటే.. ఇక కట్టు తెగిపోతుందన్న అంచనాలు వస్తాయి. ఇది వైసీపీ అగ్రనాయకత్వాన్ని వెనక్కి లాగుతున్న రెండో అంశ?టీడీపీ - జనసేన పొత్తులు పెట్టుకోవడంతో ఏపీ రాజకియ సెంటిమెంట్ చాలా వరకూ మారిపోయింది. పవన్ కల్యాణ్ ను పదే పదే టార్గెట్ చేసి ఆయనను టీడీపీతో కలిసేలా పరిస్థితులు కల్పించింది వైసీపీ నాయకులేనన్న సెటైర్లు ఉన్నాయి. అసలు కలిసిపోయిన తర్వాత దమ్ముంటే ఒంటరిగా పోటీ చేయమనే సవాళ్లను చేస్తున్నారు. ఇలాంటివి రాజకీయాల్లో.. వేరే అర్థాలకు కారణం అవుతాయి. ఇప్పుడు బీజేపీ కూడా వైసీపీకి వ్యతిరేక కూటమిలో చేరనుందేన్న ప్రచారం జరుగుతోంది. బీజేపీ .. వైసీపీ వ్యతిరేక కూటమిలో ఉంటే తమకు ఎంత నష్టం జరుగుతుందో వైసీపీ పెద్దలకు బాగా తెలుసు. గత ఎన్నికల సమయంలో బీజేపీతో పొత్తు లేకపోయినా.. టీడీపీని ఓడించడానికి బీజేపీ కావాల్సిన సహకారం అందించింది. అందుకే చంద్రబాబు పదవి కాలం ముగియక ముందే .. ఈసీ ద్వారా ఎల్వీ సుబ్రహ్మణ్యాన్ని సీఎస్‌గా నియమించుకుని రెండు నెలల ముందుగానే పాలనను పరోక్షంగా తమ చేతుల్లోకి తెచ్చుకోగలిగారు. ఈ సారి బీజేపీ టీడీపీ, జనేసన కూటమికి సహకరిస్తే.. అంత కంటే ఘోరమైన పరిస్థితి వైసీపీకి ఎదురయ్యే అవకాశం ఉందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ రాజకీయ పరిణామాలన్నింటినీ విశ్లేషించుకున్న వైఎస్ఆర్‌సీపీ పెద్దలు ఇంచార్జులు మార్పు అనే వ్యూహంపై వెనక్కి తగ్గాని నిర్ణయించుకున్నట్లుగా కనిపిస్తోంది. మైలవరం నుంచి వసంత కృష్ణప్రసాద్ ను మార్చేస్తామని ముందుగా నిర్ణయించారు. వేరే చోట నుంచి పోటీ చేయాలని సూచించారు. కానీ ఆయన తాను అసలు పోటీ చేయనని చెప్పి వెళ్లిపోయారు.సీఎంవో పిలిచినా రాలేదు. కానీ మళ్లీ మైలవరంలోనే పోటీ చేసేందుకు చాన్సిస్తామని చెబితేనే వచ్చారు. ఇప్పుడు ఆయనకే టిక్కెట్ ఖరారు చేశారు. అలాగే బాలినేని శ్రీనివాస రెడ్డి , రోజా , అంబటి రాంబాబు సహా కీలక నేతలందరి పేర్లు మార్పు జాబితాలోకి వచ్చినా మళ్లీ తప్పించారు ఇప్పటికే 11 నియోజకవర్గాల్లో నియోజకవర్గాలను మార్చారు. ఇందులో అటూ ఇటూ తిప్పిన వారు కాకండా నికరంగా ముగ్గురికే టిక్కెట్ నిరాకరించారు. ఇక మహా అయితే మరో పది మందికి మాత్రమే టిక్కెట్ నిరాకరిస్తారని.. సిట్టింగ్‌లకే చాన్సిస్తారని వైసీపీ వర్గాలు ప్రచారం ప్రారంభించాయి. మొత్తంగా కసరత్తు పేరుతో వైసీపీలో చిచ్చు పెట్టుకోవడం తప్ప.. పెద్దగా మార్పులేమీ ఉండవని వైసీపీ వర్గాలు ఇప్పుడు గట్టిగా నమ్ముతున్నాయి.

# ఏపీలో మైండ్ గేమ్...



**విశాఖపట్టణం, జనవరి 1**:ఆంధ్రప్రదేశ్‌లో జమిలీ ఎన్నికలు జరగనున్నాయి. అసెంబ్లీతో పాటు లోక్ సభ ఎన్నికలు మార్చి, ఏప్రిల్‌లో జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో రాజకీయ పార్టీల మధ్య పొత్తుల అంశం రోజు రోజుకు హాట్ టాపిక అవుతోంది. ఇప్పటికి జనసేన, టీడీపీ కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి. తమ జనసేనతో పొత్తుల్లో ఉన్నామని బీజేపీ పదే దే చెబుతోంది. టీడీపీతో కలిసి పోటీ చేస్తామంటున్న జనసేన కూడా బీజేపీతో విడిపోయామని ఎక్కడా చెప్పడం లేదు. ఈ కన్ఫ్యూజన్‌లో ఏపీ రాజకీయాల్లో ఒకరి మీద ఒకరు మైండ్ గేమ్ ప్రారంభించారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.టీడీపీ, జనసేన కూటమిలో బీజేపీ చేరబోతోందని.. నివేదిక మొత్తం ప్రధాని మోదీ వద్దకు చేరిందని.. సంక్రాంతి లోపే నిర్ణయం తీసుకుంటారని ఓ ప్రచారం జోరుగా సాగుతోంది మీడియాలోనూ ఇదే వస్తోంది. ఏపీలో గత ఎన్నికల్లో బీజేపీ పార్టీకి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయని ఇతర పార్టీలకు చెందిన కొంత మంది నేతలు విమర్శలు చేస్తూంటారు. అలా అయితే బీజేపీని పట్టించుకోకూడదు కానీ బీజేపీని కూటమిలో కలుపుకోవాలని ఎందుకు అనుకుంటారని ఆ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. బీజేపీకి కనీసం ఆరు నుంచి ఎనిమిది శాతం ఓట్లు ఉంటాయయని అన్ని రాజకీయ పార్టీలు తాము బీజేపీకి దగ్గర అని ప్రచారం చేసుకుని బీజేపీకి ఓటేసినా.. మాకు ఓటేసినా ఒకటే అని నమ్మిస్తున్నాయని అందుకే తమ ఓటు బ్యాంక్ వేరే పార్టీలకు వెళ్తుందని చెబుతున్నారు. ఏపీలో లోక్‌సభ ఎన్నికలతో పాటే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటింగ్ ప్రయారిటీలో జాతీయ అంశాలు ప్రధానంగా ఉంటాయి. ఇది బీజేపీకి మరింతగా మేలు చేసే అవకాశం ఉంది. కూటమిలో ఉంటే.. ఆ కూటమి వైపే ప్రజలు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఇటీవల ఏబీపీ న్యూస్ - సీ ఓటర్ నిర్వహించిన ఒపీనియన్ పోల్‌లో ప్రధానిగా మోదీకి 56 శాతం మద్దతు ఉన్నట్లుగా తేలింది. లోక్ సభ ఎన్నికలు ప్రధాన మంత్రి ఎవరు అనే ప్రాతిపదికనే జరుగుతాయి. అందుకే ఓటర్ల ప్రయారిటీ ఎక్కువగా బీజేపీకి మద్దతిచ్చే పార్టీకే ఉంటుంది. ప్రాంతీయపార్టీలు పోటాపోటీగా బీజేపీకి తామంటే తాము సపోర్టుగా ఉంటామన్న రాజకీయం చేస్తూ ఓటర్లను నేరుగా బీజేపీ వైపు రాకుండా చేస్తున్నారని బీజేపీ నేతలంటున్నారు. . ఈ క్రమంలో బీజేపీతో పొత్తులు పెట్టుకుంటే కలసి వస్తుందని భావిస్తున్నారు. అందుకే బీజేపీతో పొత్తులని అంటున్నారంటున్నారు. బీజేపీకి ఆరు లోక్ సభ, 17 అసెంబ్లీ సీట్లు ఆఫర్ చేసినట్లుగా మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే దీన్ని మైండ్ గేమ్‌బా బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. అందుకే బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి తాము 75 అసెంబ్లీ సీట్లు, 15 పార్లమెంట్ సీట్లు అడుగుతామని స్పష్టం చేశారు. పొత్తులపై కేంద్ర నాయకత్వం ఇప్పటి వరకూ చర్చలు జరపలేదని ఆయన స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ హైకమాండ్ జనవరి మూడు, నాలుగు తేదీల్లో కీలక సమావేశాలు నిర్వహించనుంది. ఆ సమావేశాల్లో పొత్తులపై అభిప్రాయాలు తెలుసుకుని.. తదుపరి హైకమాండ్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. అందుకే మీడియాలో జరుగుతున్న ప్రచారం అంతా మైండ్ గేమేనని ఏపీ బీజేపీ నమ్ముతోంది.

# విశ్వరూప్ వర్సెస్ శ్రీకాంత్..

**అమలాపురం, జనవరి 1:**అమలాపురం వైసీపీ టికెట్ విషయంలో తండ్రీకొడుకుల పంచాయితీ పీక్స్‌కి చేరినట్టే కనిపిస్తోంది. ఇన్‌ఛార్జ్‌గా తనకే బాధ్యతలు ఇచ్చారంటూ మంత్రి విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్ ఇప్పటికే ప్రచారం మొదలు పెట్టేశారు. అమలాపురంలో ఫ్లెక్సీలు, బ్యానర్లు కనిపిస్తున్నాయి. అయితే, ఈ వివాదంపై తొలిసారిగా నోరు విప్పారు విశ్వరూప్. డౌట్ లేదు.. తానే పోటీస్తున్నానంటూ క్లారిటీ ఇచ్చారు. పనితీరును బట్టే టికెట్‌లు ఇస్తారని.. అమలాపురంలో పోటీ చేసేది తానేనంటూ పేర్కొన్నారు. 175 సీట్లు గెలవాలనేదే సీఎం జగన్ లక్ష్యంమని, ఎవరికైనా టికెట్ కాదంటే వారికి మరో రూపంలో పదవులు వస్తాయని విశ్వరూప్ పేర్కొన్నారు. ఈ టర్మ్ తనదేనంటూ కాన్ఫిడెంట్‌గా చెప్పారు.అధిష్టానం ఇప్పటికే మంత్రి తనయుడు శ్రీకాంత్ పేరును ఖరారు చేసిందంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. ఇవాళో, రేపో అధికారిక ప్రకటన వస్తుందంటున్నారు. అయితే, మంత్రి విశ్వరూప్ మాత్రం పోటీ చేసేది తానేనంటున్నారు. ఇది క్యాడర్‌ను కాస్త గందరగోళానికి గురి చేస్తోంది. తండ్రీ కొడుకుల మధ్య విభేదాలు స్పష్టంగా బయటపడడంతో.. శ్రీకాంత్ తీరుపై విశ్వరూప్ సన్నిహితులు, ముఖ్యనేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ శ్రీకాంత్‌కే టికెట్ ఇస్తే కనుక తాము ఇస్తే సహకరించేది లేదని విశ్వరూప్ వర్గం చెప్తోంది. అయితే, వీటిని పట్టించుకోకుండా కుమారుడు మాత్రం తన పని తాను చేసుకుపోతున్నారు.కుటుంబంలో విభేదాల విషయం బయటకు రావడంతో విశ్వరూప్ ఆచితూచి మాట్లాడుతున్నారు. కుమారుడికి టికెట్ అనే విషయాన్ని ప్రస్తావించకుండా.. పోటీలో తానే ఉంటానంటూ చెప్తున్నారు. పెద్దాయనే పోటీలో ఉంటున్నారు కాబట్టి కన్ఫ్యూజన్ వద్దనేలా ఆయన క్యాడర్‌కి మెసేజ్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

# 2024 కొత్త సంవత్సరంలో..
# భవిష్యత్తు ప్రజా ఉద్యమాలదే

**చెప్పులు కుడుతూ తమ నిరసన తెలిపిన కార్మికులు.**

**సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీనన్న**

**బద్వేలు:**కార్మికులకు జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె 7రోజులో భాగంగా బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్( సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ మున్సిపల్ కార్యాలయం వద్ద చెప్పులు కుడుతూ తమ నిరసన తెలియజేశారు.

**ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీనన్న మాట్లాడుతూ....**

ఆనాడు మున్సిపల్ కార్మికులను పొగడ్తలతో ముంచేత్తిన పాలకులు నేడు వారిపై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని,పారిశుధ్య కార్మికులకు లక్ష రూపాయలు జీతం ఇచ్చిన తక్కువేనని మాట్లాడిన జగన్మోహన్ రెడ్డి గారు నేడు వేతనాల పెంపుపై పెదవి విరచడం శోచనీయమని, సమాన పనికి- సమాన వేతనం ఇవ్వాలని కోర్టులు తీర్పునిచ్చిన ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, కార్మికుల అంటే లెక్కలేదు కోర్టు తీర్పులు అన్న లెక్కలేదు ఇచ్చిన హామీలను నెరవేర్చే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని, పైపెచ్చు అందరికీ వేతనాలు పెంచేసామని ప్రజలను పక్కదారి పట్టించడం సూచనియమన్నారు, కొంతమందికి వేతనాలు పెంచి సంక్షేమ పథకాల్లో కోత పెట్టి కార్మికులను సర్కారు మోసగించిందని, పని భారం పెంచి కార్మికుల నడ్డి విరిచిందని ఎన్నికలకు



ముందు పర్మినెంట్ చేస్తామని మాట ఇచ్చి నేడు విస్మరించిందని, రెగ్యులైజ్ చేయమని అడిగితే నేరమని సమ్మెను పరిష్కారం చేయాల్సిన ప్రభుత్వం విచ్చిన్నం చేయడంపై దృష్టి పెట్టిందని కార్మికులపై కక్ష సాధిస్తుందని ఇవేమీ తెలియనట్లు ముఖ్యమంత్రి నటిస్తున్నారని ఇలా నిరంకుశ చర్యలు చేపట్టిన ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయని కార్మిక హక్కులను హరిస్తున్న ప్రభుత్వం కార్మికులకు అండగా నిలుస్తున్న కమ్యూనిస్టులపై దుష్ప్రచారం చేయడం తగదని పేదలకు కార్మికులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం కార్మికుల వెన్ను విరడం దుర్మార్గమని అండగా నిలిచే వారిపై బురద చల్లటం అమానుషమని కార్మిక హక్కులు హరించడంలో మోడీ జగన్ ప్రభుత్వాలు రెండు ఒకే బాటలో ప్రయాణిస్తున్నయని కార్మిక చట్టాలను కార్మిక కోడ్ ల పేరుతో మోడీ ప్రభుత్వం హరిస్తుందని 2023 వ సంవత్సరం కార్మిక ప్రజా ఉద్యమాలతో ముగిస్తుందని, 2024వ సంవత్సరం కార్మిక నిరసనలతో ప్రారంభమవుతుందని, కనీసం కొత్త సంవత్సరంలోనైనా ప్రభుత్వం కార్మికుల సమ్మెకు ముగింపు పలికి కోర్కెలు అంగీకరించాలని లేనియెడల ఉద్యమాలను ఉధృతం చేయడం తప్ప మరో మార్గం లేదని కొత్త సంవత్సరంలో కార్మిక ఉద్యమాలు విజయం సాధిస్తాయని ప్రజల అండతో ముందుకు సాగుతాయని విధానాల మార్పుపై పోరు సాగిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు గౌతమి, పట్టణ అధ్యక్షురాలు అనంతమ్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, వడ్డెర వృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు గంప సుబ్బరాయుడు, సిఐటియు పట్టణ నాయకులు రాజగోపాల్, యూనియన్ పట్టణ అధ్యక్షులు పులి శ్యాం ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు దియ్యాల హరి, ఉపాధ్యక్షులు దియ్యాల దేవమ్మ, గంటా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి దియ్యాల నాగేంద్రబాబు, కార్యదర్శులు నాగరపు సత్యరాజు, బద్వేల్ ప్రవీణ్ కుమార్, నేలటూరు పాలయ్య, కోశాధికారి కాలువ శివకుమార్ కమిటీ సభ్యులు పద్మిశెట్టి రామయ్య, ఇండ్ల చంద్రశేఖర్, తేళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ ఇయర్ వేడుకల్లో బీఆర్ఎస్ , కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ,,,, వ్యక్తి మృతి

**కామారెడ్డి జనవరి 1**: కామారెడ్డి జిల్లా నుసురాబాద్ మండలం, నాచుపల్లిలో న్యూ ఇయర్ వేడుకల్లో అపశ్రుతి చుతుచేసుకుంది.. న్యూ ఇయర్ వేడుకల్లో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ నాయకుడిపై దాడి చేసిన సంఘటనలో కాంగ్రెస్ నేత సాదుల రాములు మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.నిన్న రాత్రి నాచుపల్లి గ్రామంలో యువకులు, వివిధ రాజకీయ పక్షాలకు చెందిన వారు న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. పార్టీ చేసుకున్నారు. పన్నెండు - ఒంట గంట సమయంలో గ్రామంలో తిరుగుతున్నప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు ఎదురుపడ్డారు. గ్రామ కూడలి వద్ద ఇరు పక్షాల మధ్య వాదోపవాదాలు జరిగి ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో కాంగ్రెస్ నేత సాదుల రాములు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర పై అవగాహన సదస్సు



**కౌతాళం:**వికాసిత్ భారత్ సంకల్పయాత్ర పై పంచాయితీ కార్యాలయంలో ప్రజలకు అవగాహన సదస్సు ఏవో సత్యన్న కల్పించారు. ఈ అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే ఏ పథకమైనా సామాన్యుల లబ్ది కోసమే. కాని అది వారికి ఎలాంటి ప్రయోజనాన్ని కలిగించిందో.. అసలు ఎలాంటి పథకాలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవడం కూడా ముఖ్యం. వాటి అమలు ఎలా ఉందో కూడా ప్రభుత్వం పర్యవేక్షించాలి. అందుకే దీనికోసం కేంద్రం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను కేంద్రం స్టార్ట్ చేసింది. ప్రధాని నరేంద్ర మోడీ నవంబర్ 15న ప్రారంభమైనప్పటి నుంచి ఈ యాత్ర విశేషంగా అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోంది. వీటిపై గ్రామీణ స్థాయిలో చాలా మందికి అవగాహన లేకపోవడం వల్ల లబ్ధి చేకూరడం లేదని ప్రభుత్వం దృష్టికి వచ్చిన కారణంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ఉపయోగాలు, ఎవరు వీటికి అర్హులు అనే పూర్తి సమాచారాన్ని అట్టడుగు స్థాయి వర్గాల ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని దృఢ సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో శేషాద్రి రావు, ఏపీఓ జుబేర్ అహ్మద్, మంత్రాలయం నియోజకవర్గం బిజెపి మండల కన్వీనర్ చిన్న ఈరన్న ,మండల కన్వీనర్ ఈరన్న నాయకులు విష్ణు వర్ధన్ మరియు ఆయా శాఖల అధికారులు, సచివాల సిబ్బంది రెవెన్యూ సిబ్బంది వైద్య సిబ్బంది వాలంటీర్స్ పాల్గొన్నారు.

## కస్టమర్లపై హోటల్ వెయిటర్ల దాడి

**హైదరాబాద్:**అబిడ్స్ గ్రాండ్ హోటల్ వెయిటర్లు కస్టమర్లపై దాడి చేశారు. డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి అబిడ్స్ పోస్టాఫీస్ వెనుక ఉన్న గ్రాండ్ హోటల్ వెయిటర్లు కర్రలతో కస్టమర్ల పై దాడి చేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వెంటనే స్పందించి ఇన్స్పెక్టర్ అబిడ్స్తో మాట్లాడి గ్రాండ్ హోటల్ వెయిటర్లు, యజమాని పై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. లేనిపక్షంలో హోటల్కు నిప్పు పెడతామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల మృతి

**సంగారెడ్డి:**సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నోవోపాన్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. డివైడర్ ను ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందారు.సంగారెడ్డి జిల్లా సుల్తాన్ పూర్ జెఎన్టీయూ లో భరత్, నితిన్, వర్షిత్ బీటెక్ సెకండియర్ చదువుతున్నారు. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా హాస్టల్ నుంచి సాయంత్రం బయటకు వెళ్లారు. సంగారెడ్డి నుంచి మరికొంత మంది స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాలపై రాయదుర్గంలోని దుర్గం చెరువును చూసేందుకు వెళ్లారు. అక్కడ అనుమతించకపోవడంతో తిరుగు ప్రయాణమయ్యారు. పటాన్ చెరు సాకి చెరువు వద్ద కాసేపు కాలక్షేపం చేసిన స్నేహితులు సంగారెడ్డికి వెళు న్న క్రమంలో పటాన్ చెరు నోవోపాన్ వద్ద రోడ్డు




ప్రమాదం జరిగింది. బైక్ నడుపుతున్న భరత్ చందర్(19), నితిన్ (18) అక్కడికక్కడే మృతి చెందారు. వర్షిత్ తీవ్ర గాయాలకు గురయ్యాడు. భరత్ చందర్ పాలకుర్తి, నితిన్ జనగామ, వర్షిత్ ఖమ్మం కు చెందిన వారిగా గుర్తించారు.

## ఎమ్మెల్యే తలసాని ప్రత్యేక పూజలు

**సికింద్రాబాద్:**నూతన సంవత్సరం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అత్తెలి అరుణ, బీఆర్ఎస్ నేతలతో కలసి సికింద్రాబాద్ లోని ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన తలసాని, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా జీవించాలని వేడుకున్నట్లు వెల్లడించారు. పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ పండితులు పూజలు నిర్వహించి ఎమ్మెల్యే కు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందచేశారు..

# చేసినపాపాలే..శాపాలై..

**విజయవాడ, జనవరి 1:**ఏపీలో అధికార వైఎస్సార్సీపీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు సాధారణ ప్రజానీకంలో సైతం ఆసక్తి కలిగిస్తున్నాయి. పలు నియోజక వర్గాల్లో అభ్యర్థుల మార్పు, స్థాన చలనం, కొత్తవారికి సీట్లు అంటూ పూటకో ప్రచారం జరగడం అందరినీ ఆకర్షిస్తోంది.2019 అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 151మంది ఎమ్మెల్యేలు వైసీపీ నుంచి గెలిచారు. నాలుగున్నరేళ్ల తర్వాత వారిలో మూడో వంతు మందికి ఖచ్చితంగా స్థాన చలనం, సీటు దక్కకపోవడం వంటి కష్టాలు ఎదురయ్యాయి. దీనికి ఎమ్మెల్యేల స్వీయ తప్పిదాలే కారణంగా కనిపిస్తోంది.అసంతృప్తి ఎదుర్కొంటున్న ప్రజా ప్రతినిధుల్లో చాలా మంది అధికారంలో ఉన్న నాలుగేళ్లలో ఏ మాత్రం పట్టించుకోకపోవడం ప్రధాన సమస్యగా మారింది. దీనికి తోడు ఎవరికి వారు సొంతంగా అనుచరుల్ని ఏర్పాటు చేసుకుని అందినకాడికి సంపాదించుకునే పనిలో నిమగ్నమై నియోజక వర్గాలను పట్టించుకోవడం మానేశారు. ప్రధానం పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున అసంతృప్తి మూటగట్టుకున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు అసంతృప్తి ఎదుర్కొంటున్న నియోజక వర్గాల్లో సమస్యలు ఒకే తరహాలో ఉంటున్నాయి.గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి లేకపోవడం, సంక్షేమ పథకాలకు మాత్రమే పరిమితం కావడం, రోడ్లు, డ్రెయిన్లు, పారిశు ధ్యం, తాగునీరు వంటి కనీస సౌకర్యాల విషయంలో ఎమ్మెల్యేలు శ్రద్ధ తీసుకోకపోవడం వారికి శాపాలుగా మారాయి.పట్టణ ప్రాంతాల్లో అయితే ఎమ్మెల్యేలు నియోజక వర్గాలను తమ సామంత రాజ్యాలుగా



భావించారు. టౌన్ప్లానింగ్, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ అనుమతులతో సంబంధం లేకుండా సొంత ఇల్లు కట్టుకోవాలంటే ఎమ్మెల్యే అనుచరులకు కప్పం కట్టుకోవాల్సిన పరిస్థితులు కల్పించారు. ప్రైవేట్ సైన్యాలను ఏర్పాటు చేసుకుని అందినంత వసూలు చేశారు. మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో మధ్య తరగతి ప్రజలు ఇల్లు కట్టుకోవాలంటే భయపడే పరిస్థితులు కల్పించారు. ఇంటి ముందు నిర్మాణ సామాగ్రి కనిపిస్తే బలవంతపు వసూళ్లు సాధారణం అయిపోయాయి.ఎమ్మెల్యేలకు కీలక అనుచరులుగా ఉన్న కార్పొరేటర్లు వారి చెప్పు చేతల్లో ఉండే చోటా నాయకులతో ఈ వసూళ్ల దందా నడిపించారు. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో ఎమ్మెల్యేలను పూర్తి స్థాయిలో అదుపాజ్ఞల్లో ఉంచారు. వాలంటీర్లతో కూడిన సచివాలయ వ్యవస్థ, ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించడం వంటి కార్యక్రమాలకు తమ ప్రమేయం లేకుండా పోతోందని చాలా మంది గగ్గోలు పెట్టారు. వాలంటీర్లను తమకు అనుసంధానించాలని ఒత్తిడి చేయడంతో చాలా చోట్ల ఎమ్మెల్యేల పతనం ప్రారంభమైంది.కోవిడ్ తర్వాత చాలా నియోజక వర్గాల్లో ప్రైవేట్ దందాలకు ప్రజాప్రతినిధులు తెరతీశారు. ఇక నామినేటెడ్ పోస్టుల్లో పార్టీ కోసం పనిచేసిన వారిని కాకుండా తమ అక్రమాలకు అండగా నిలిచే వారికి పెద్ద పీట వేశారు. చివరకు దేవాలయాల పాలకమండళ్లలో సైతం రౌడీషీటర్లు, క్రికెట్ బెట్టింగ్ నేరాలకు పాల్పడిన వారు, కాల్ మనీ వ్యాపారులకు కొంతమంది అవకాశం కల్పించారు. ఇలాంటి తప్పిదాలన్నీ ఎమ్మెల్యేలకు చుట్టుకున్నారు. ఎన్ని సర్వేలు చేసినా వారికి గెలిచే అవకాశాలు లేవని తేలడంతో కొత్త ముఖాలతో ఎన్నికలకు వెళ్లేందుకు వైసీపీ సిద్ధం అవుతోంది.2019 ఎన్నికల్లో గెలిచిన వారిలో చాలా మంది ఎమ్మెల్యేలు స్థానికంగా బలం లేకపోయినా, వైసీపీ హవాలో గెలిచిన వారే కావడంతో ఈ సారి కూడా అలాంటి అదృష్టమే వరిస్తుందని వైసీపీ భావిస్తోంది. ఇది ఎంతమేరకు ఫలిస్తుందో చూడాలి. దీంతో పాటు సామాజిక సమీకరణలు, ఓటు బ్యాంకుల ఆధారంగా నియోజక వర్గాలకు అభ్యర్థులను ఖరారు చేస్తోంది. ఇదే విజయాన్ని చేకూరుస్తుందని వైసీపీ విశ్వాసంతో ఉంది.

## పాలకులకేమో నూతన సంవత్సర వేడుకలు- మాకేమో ఆకలి కేకలా

**21వ రోజు సమ్మెలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపిన అంగన్వాడీలు**

**రాష్ట్ర తెలుగుదేశం మహిళా ఉపాధ్యక్షురాలు ఝాన్సీ**

**బద్వేలు:** అంగన్వాడి వర్కర్లు, మినీ అంగన్వాడీలు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త సమ్మె 21వ రోజు లో భాగంగా స్థానిక సమగ్ర శిశు అభివృద్ధి అధికారిని (సిడిపిఓ) కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలియజేశారు. 21 రోజు సమ్మెకు తెలుగుదేశం మహిళ విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, మున్సిపాలిటీ నాయకురాలు ఆదిలక్ష్మి,13వ వార్డు టిడిపి కౌన్సిలర్ షేక్ మహమ్మద్ హసన్,34వ వార్డు కౌన్సిలర్, టిడిపి మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ మిత్తి కాయల సునీత లు పాల్గొని తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

**సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ....**

ఇప్పటికే రెండుసార్లు మంత్రులు అంగన్వాడీల సమస్యలపై చర్చించి కూడా ముఖ్యమంత్రితో ఇంతవరకు మాట్లాడలేదంటూ కాలయాపన చేస్తూ అంగన్వాడీ కార్యకర్తలను ఆందోళన బాట పట్టించింది ప్రభుత్వమే! వారి సమ్మెను అణచి వేసేందుకు అంగన్వాడీ కేంద్రాల తాళాలను బద్దలు కొట్టించింది. గ్రామంలో ఉన్న సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, ఆర్పీలు, డ్వాక గ్రూపు మహిళల ద్వారా అంగన్వాడీ కేంద్రాలను నడిపే దానికి పురమాయించింది. అయినా న్యాయమైన అంగన్వాడీ కార్యకర్తల కోర్కెలకు వారందరూ మద్దతు ఇస్తున్నారు. వివిధ తరగతుల ప్రజలు మద్దతు ఫలితంగా ఎమ్మెల్యేలు అంగన్వాడి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రితో మాట్లాడుతామని అంగన్వాడీ కార్యకర్తలకు తెలియజేస్తున్నారు. చివరకు ఫుడ్ కమిషన్ చైర్మన్ కూడా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీ కార్యకర్తల జీతాలు పెంచాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను ప్రధాన సెంటర్లుగా మార్చాలని చెప్పవలసి వచ్చింది. అంగన్వాడీ ల సమస్యల పట్ల సర్వత్రా సానుకూలత ఉన్నా ముఖ్యమంత్రి కి సమస్యను పరిష్కరించడం చేతకావడం లేదు.బలవంతంగా నిర్బంధముతో అణిచివేయడానికి పూనుకోవడం శోచనీయం. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి గారు పూనుకోవాలి. అనవసర ఆర్భాట ఖర్చులను, అధిక రేట్లు పెట్టి కొనుగోళ్ళను,ఆప్త మిత్రులకు ఆస్తులు కట్ట పెట్టడాన్ని మానుకుంటే అంగన్వాడీలు అడిగిన వేతనం కంటే అదనంగా వేతనం చెల్లించవచ్చు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని మహిళల ఆగ్రహానికి గురికావద్దని హితవు పలికారు.

## దక్షిణాది రాష్ట్రాల్లో వినియోగదారుల ఉద్యమాన్ని పటిష్టం చేస్తాం

**దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్**

**హైదరాబాద్ జనవరి 1:**దక్షిణాది రాష్ట్రాల్లో వినియోగదారుల ఉద్యమాన్ని పటిష్టం చేస్తాం - దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డా. పల్లెపాడు దామోదర్ అన్నారు. హైదరాబాద్ లోని ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య కార్యక్రమంలో పల్లెపాడు దామోదర్ ప్రసంగించారు. ప్రస్తుతం 24 వ తేదీ నుండి 30 వ తేదీ వరకు జరుగుతున్న జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరు వినియోగదారుల హక్కుల పట్ల ప్రతీ ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని, కాబట్టి వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేస్తూ, వినియోగదారుల సంఘాలు గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకు విస్తృతం అవుతున్న క్రమంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, కాబట్టి పోలీస్ శాఖ




సహకారంతో వినియోగదారుల సంఘాలు పనిచేయాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. ఇంకా నేటి కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమితి ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, హైదరాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ చెర్మన్ మామిడి భీం రెడ్డి, %ూ×జఔజ% జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శిల్పా రెడ్డి, %ూ×జఔజ% నేషనల్ సెక్రటరీ ఐజాక్ రాజ్, సి.సి.ఐ. సభ్యులు డా. హరిప్రియా రెడ్డి, పాల్గొని ప్రసంగించారు. అనంతరం తదుపరి మూడు సంవత్సరాలకు దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి కి అధ్యక్షుడు గా రెండవ మారు ఎన్నికైన డా. పల్లెపాడు దామోదర్ ను రెడ్ క్రాస్ సొసైటీ చెర్మన్ సన్మానించారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137